SHARP NEWS
తెలుగు జాతీయ
దినపత్రికలో ప్రకటనల
కోసం సంప్రదించండి
V.V. Sarma, Editor
- Mob No:
8466099201

బుధవారం, ఏప్రిల్ 16, 2025 వెల: 5 రూ/.
సంపుటి: 12 సంచిక: 128, పేజీలు - 08

# షార్ప్ న్యూస్

జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ : వూటుకూరు వేంకటేశ్వర శర్మ

విలేకరులు కావలెను
(Part Time/Full Time)
రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలకు విలేకరులు కావలెను
అర్హతలు : తెలుగులో రాయడం రావాలి. సమాజం మీద అవగాహన ఉండాలి.
Send your Resumes to : Whats app No: 8985483063 (Don't call)
mail id :sharpnews2012@gmail.com

CIRCULATED FROM HYDERABAD, NALGONDA, KARIMNAGAR, WARANGAL, KHAMMAM, VIJAYAWADA, VISAKHAPATNAM, NELLORE



జపాన్ పర్యటనకు
సీఎం రేవంత్ రెడ్డి

2లో..



కులమతాలను
రెచ్చగొడుతున్న జగన్

2లో..



అయోధ్య ఆలయానికి
బాంబు బెదిరింపు

2లో..



ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు
- చెక్ డ్యామ్ దగ్గర సెల్ఫీ దిగిన కవిత

2లో..



తడిసి ముద్దయిన
భాగ్యనగరం

2లో..



# పార్టీ లైన్ దాటితే సహించం



## - ఎమ్మెల్యేలకు రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్

**హైదరాబాద్** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కొన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారాలను ప్రభుత్వం కనుగొందని తెలిపారు. సన్న బియ్యం పథకం ఒక అద్భుతమైన పథకమని, గతంలో 2 రూపాయల కిలో బియ్యం పథకంలాగా ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి చొచ్చుకెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన భు భారతి పోర్టల్ యొక్క ప్రయోజనాలు రైతులకు చేరాలని అన్నార సీఎం రేవంత్ రెడ్డి. ఈ పోర్టల్ ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు ఈ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు రేవంత్ రెడ్డి. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి, అర్హులైన పేద కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎవ్వరూ నిరాశ్రయులుగా ఉండకూడదని చెప్పిన రేవంత్ సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. కుల గణన ద్వారా 100 సంవత్సరాల నాటి సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు సీఎం. విద్య, ఉద్యోగాలలో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టాలు చేసిందని గుర్తుచేశారు. రాజకీయ అవకాశాలను కూడా కల్పించిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఇది తమ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అని వెల్లడించారు. పరిష్కారం ఎస్సీ వర్గీకరణ వంటి సంక్లిష్ట సమస్యకు శాశ్వత పరిష్కారం అందించామని చెప్పిన రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ కోసం చట్టం చేసే వరకు ఉద్యోగ ప్రకటన విడుదల చేయకపోవడానికి కారణం అదే అన్నారు. ఎస్సీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యేలు నేటి నుండి జూన్ 2 వరకు వారి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలో పర్యటించాలని విజ్ఞప్తి చేశారు.

2లో..

## మే 2న ఏపీకి మోడీ : అమరావతికి శంకుస్థాపన

(అమరావతి, షార్ప్ న్యూస్ బ్యూరో): ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటన ఖరారైంది. ప్రధాని మే2 న అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రధాని టూర్ గురించి ఏపీ కేబినెట్ మీట్ లో వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అసెంబ్లీ, హైకోర్టు కొత్త భవన నిర్మాణాల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.627 కోట్లతో అసెంబ్లీ బిల్డింగ్, రూ.786 కోట్లతో కొత్త హైకోర్టు బిల్డింగ్ నిర్మిస్తారు. 3 ఏళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రోడ్ల పనులు పూర్తవుతాయని సీఎం చంద్రబాబు



2లో..

## అబద్దాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ : హరీష్‌రావు

**- అబద్దాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ : హరీష్‌రావు**



**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ ఈజీగా అబద్దాలు చెబుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోందని, హామీల అమలులో పూర్తిగా విఫలమై మోసం చేస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలంతా ఇదే తంతు నడుపుతున్నారని విమర్శించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మంచిర్యాలలో చేసిన వ్యాఖ్యలు అన్నీ అబద్దాలే అని ఆయన విమర్శించారు. 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చామంటూ మళ్లీ పాత పాట పాడారని, కానీ బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చిన వాటినే వడ్డీ లేని రుణాలుగా ప్రచారం చేసుకుంటున్నారని హరీశ్ ఆరోపించారు. మీ ప్రభుత్వం మాకు లాగే 5 లక్షల వరకే వడ్డీ లేని రుణాలు ఇస్తోంది

2లో..

## అమరావతి విస్తరణకు 44వేల ఎకరాలా ?

4లో..

## సరస్వతి పుష్కరాల వెబ్‌సైట్, యాప్ ప్రారంభం

**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** కాళేశ్వరం సరస్వతి పుష్కరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌ను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు.

2లో..




## పింక్ బుక్ ఓపెన్ చేశాం..

**- కాంగ్రెసోళ్ళ పేర్లు రాస్తాం: కవిత వార్నింగ్**

**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** కాంగ్రెసోళ్ళ పేర్లు రాస్తాం: కవిత వార్నింగ్బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్న కాంగ్రెస్ నేతలు జాగ్రత్త! పింక్ బుక్ ఓపెన్ చేశాం... మీ అందరి పేర్లను అందులో రాసుకుంటామని ఎమ్మెల్సీ కవిత వార్నింగ్ ఇచ్చారు. బాన్సువాడలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.

2లో..



# మంత్రి పదవుల కోసం రచ్చ..

## రేవంత్ వార్నింగ్ !

- తెలంగాణ కేబినెట్ విస్తరణపై టెన్షన్
- 6 బెర్తుల కోసం కాంగ్రెస్ లో ఫైటింగ్
- ఇప్పటికే ముగ్గురు అధిష్టానికి వార్నింగ్ !
- ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దన్న సీఎం రేవంత్

**( మేడుకొండూరు విష్ణుకుమార్, సీనియర్ జర్నలిస్ట్)**



తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ లో బెర్తులు ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియదు గానీ... కాంగ్రెస్ లీడర్లలో రోజు రోజుకీ అసంతృప్తి పెరిగిపోతోంది. 2023 డిసెంబర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరినప్పుడు ఆయనతో పాటు 11 మంది మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇంకా ఆరుగురికి కేబినెట్ లో ఛాన్స్ ఉంది. ఎంపీ ఎన్నికల తర్వాత, దసరా, సంక్రాంతి, ఉగాది... ఇలా ఎప్పటికప్పుడు ఊరించుకుంటూ వస్తున్నారే తప్ప కేబినెట్ విస్తరణకు ఇంకా ముహూర్తం పెట్టలేదు. దాంతో ఆశావహుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. చాలామంది ఇప్పటికే ఢిల్లీ వెళ్ళి కాంగ్రెస్ అధిష్టానం దగ్గర పైరవీలు చేసుకున్నారు. మాకే పదవులు వస్తాయని ఆశల పల్లకీలో ఉండగా... రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ గా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు తీసుకోవడంతో సీన్ మారిపోయింది. ఈమధ్యే పార్టీలోకి వచ్చిన వారికి నో ఛాన్స్ అని ఆమె తేల్చేశారు. ఎప్పటి నుంచో కాంగ్రెస్ ను అంటిపెట్టుకొని ఉన్నవారితో పాటు అధిష్టానం హామీ ఇచ్చిన వారికి మాత్రమే మంత్రి పదవులకు ఛాన్స్ ఉందని లీకులు ఇచ్చారు. ఆ తర్వాత ఫైనల్ వీళ్ళే అనుకున్న వాళ్ళపై మరికొందరు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులు కూడా చేయడం మొదలుపెట్టారు. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సవాలక్ష లీకులు బయటకు వచ్చినా అసలు కథ ముందుకు నడవడం లేదు. అయితే మంత్రి పదవులు ఇవ్వకపోతే అవసరమైతే పార్టీని వదిలిపెట్టిపోతామని కొందరు కాంగ్రెస్ నేతలు వార్నింగ్ ఇస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేనందున తనకు ఛాన్స్ ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇప్పటికే డిమాండ్ చేశారు. నిజానికి జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు జిల్లాల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కు పెద్దగా ఆదరణ లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఎక్కువ మంది గెలిచారు. ఇంత వ్యతిరేకతలోనూ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నుంచి మల్ రెడ్డి గెలవడం విశేషం. పైగా మొదటి నుంచి కాంగ్రెస్ ను నమ్ముకున్న వ్యక్తి. అయితే రెడ్డి సామాజిక వర్గం కావడమే తన బ్యాడ్ లక్ అయితే... ఎమ్మెల్యే పదవికి రిజైన్ చేసి, బీసీ అభ్యర్థిని ఇదే స్థానం నుంచి గెలిపించి ... నేనేంటో నిరూపించుకుంటా అంటూ కాంగ్రెస్ అధిష్టానాన్ని మల్ రెడ్డి సవాల్ చేశారు. ఆ తర్వాత మంత్రి పదవిపై కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా

2లో..

# జగనన్నా మారవా ?

## సజ్జలకి పదవిపై అసహనం



(అమరావతి, షార్ప్ న్యూస్ బ్యూరో ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వైసీపీ సభ్యుల బలం 11 మందికి పడిపోయినా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిలో మార్పు రాలేదా ? గతంలో కొందరు నాయకుల కోటరీలో చిక్కుకొని ఇతర లీడర్లు, కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే ఓడిపోయామని సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా సజ్జల రామకృష్ణారెడ్డికి పార్టీలో మళ్ళీ కీలక పదవి అప్పగించడంపై పార్టీ నేతల్లో నిరసన వ్యక్తమవుతోంది. వైసీపీలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీకి సజ్జలను ఛైర్మన్ చేయాలని జగన్ డిసైడ్ అయ్యారు. తన తర్వాత సెకండ్ పొజిషన్ సజ్జలదే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. వైసీపీ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 33 మందితో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని కేంద్ర కమిటీ ప్రకటించింది. ఈ కమిటీకి కన్వీనర్ గా సజ్జల రామకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. దాంతో వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్లు జగన్ ఓఎస్డీకి ఫోన్ చేసి, పార్టీని ఏం చేస్తారు... అసలు మేం ఉండాలా వద్దా అని నిలదీసినట్టు సమాచారం. గతంలో సాక్షి పేపర్ లో ఎడిటోరియల్ డైరక్టర్ గా సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. అలాంటి ఆయన్ని తీసుకొచ్చి ఏకంగా పార్టీ పగ్గాలు అప్పజెప్పారు జగన్. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంలోనూ కీలక పదవిలో కొనసాగారు సజ్జల. ఆయన ఈ పోస్టులోకి వచ్చాక, జగన్ ని మిగతా నేతలు కలవడమే గగనమైంది. వైసీపీలో ఎమ్మెల్యేలు, సాధారణ కార్యకర్తల మాటేమో గానీ సీనియర్లు, మంత్రులకు కూడా జగన్ తో యాక్సెస్ లేకుండా చేశారని సజ్జలపై ఆరోపణలు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో వైసీపీ ఓటమిపై జరిగిన పోస్ట్ మార్టమ్ లో చాలామంది నేతలు సజ్జలను దోషిగా చూపించారు. అలాగే రామకృష్ణారెడ్డి కొడుకు సజ్జల భార్గవ రెడ్డి సోషల్ మీడియా విభాగాన్ని చూశారు. అప్పట్లో వైసీపీ సోషల్ మీడియా చేసిన అతి వల్లే జనంలో వ్యతిరేకత వచ్చిందన్న అభిప్రాయం కూడా కార్యకర్తల్లో వినిపించింది. అయినాసరే జగన్ మళ్ళీ ఏరి కోరి సజ్జలను ఎందుకు నెత్తిన పెట్టుకుంటున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు. ఈ నియామకంపై పార్టీలో ఊహించని వ్యతిరేకత ఎదురవడంతో పీఏసీకి సజ్జల కన్వీనర్ కాదనీ, కో ఆర్డినేటర్ మాత్రమే అంటూ మరో ప్రకటన వైసీపీ నుంచి వెలువడింది. సజ్జల రామకృష్ణారెడ్డిని పక్కన పెట్టుకుంటే ఈసారి కూడా వైసీపీ ఓడిపోవడం ఖాయమని. ఆ పార్టీ కార్యకర్తల నుంచి సీనియర్ లీడర్ల దాకా చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అసలు పార్టీని నడిపే ఓపిక జగన్ కు ఉందా... లేదా తాము మరో గూడు చూసుకోక తప్పదా అని కొందరు వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

# మంత్రి పదవుల కోసం రచ్చ..

బోల్డన్ని ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన ఇంట్లోనే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మినిస్టర్. పైగా నల్లగొండ జిల్లా నుంచి ఇంకో పదవి కుదరదన్న సంకేతాలు వెళ్ళాయి. కానీ రాజగోపాల్ రెడ్డితో పాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చినప్పుడే పార్టీ అధిష్టానం మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని సమాచారం. కానీ కాంగ్రెస్ పెద్దాయనగా చెప్పుకునే జానారెడ్డి ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి పదవికి అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. జానారెడ్డి ధృత రాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారనీ, నాకు మినిస్ట్రీ రాకుండా అడ్డుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కామెంట్ చేయడం కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం రేపింది. అసలు జానారెడ్డి అధిష్టానానికి లెటర్ రాయడం వల్లే ఆగిపోయిందని మండిపడ్డారు. అన్నదమ్ములు మంత్రులు అయితే తప్పేంటి, అయినా మినిస్టర్ పదవి కోసం అడుక్కునే పరిస్థితుల్లో తాను లేనని కూడా రాజగోపాల్ రెడ్డి ఫైర్ అయ్యారు. లేటెస్ట్ గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కూడా మినిస్ట్రీ కోసం స్వరం పెంచారు. తన సేవలను పార్టీ హైకమాండ్ గుర్తించాల్సిందే అని డిమాండ్ చేశారు. పార్టీలు మారి వచ్చిన వారికి పదవులు ఇవ్వాలని అనుకుంటున్నారనీ, అలాంటి వారికి ఇస్తే సహించేది లేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. పరోక్షంగా ఆయన గడ్డం బ్రదర్స్... వివేక్ వెంకటస్వామి, వినోద్ పై కామెంట్స్ చేసినట్టు తెలుస్తోంది. ప్రేమ్ సాగర్ రావు 14యేళ్ళుగా కాంగ్రెస్ ను అంటిపెట్టుకొని ఉన్నారు. అటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కూడా ప్రేమ్ సాగర్ రావుకి ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నారు. కేబినెట్ విస్తరణ లేట్ అయిన కొద్దీ, ఆశావహుల సంఖ్య కూడా పెరిగిపోతోంది. ఇప్పటికే ముగ్గురు కాంగ్రెస్ కీలక నేతలు పదవులు ఇవ్వాల్సిందేనని అధిష్టానానికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. మరి రేవంత్ రెడ్డి కేబినెట్ లోకి ఎవరికి అవకాశం ఇవ్వాలన్నది కాంగ్రెస్ అధిష్టానం ఎప్పటికి డిసైడ్ చేస్తుందో చూడాలి. కానీ ఇంకా భర్తీ చేయాల్సిన ఆరు కేబినెట్ పోస్టులకు హైకమాండ్ చాలా కసరత్తే చేయాల్సి ఉంది. మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేని జిల్లాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలతో పాటు మైనార్టీలకు కూడా బెర్తులు ఇవ్వాల్సి ఉంది. వీటిల్లో ఏ మాత్రం తేడా వచ్చినా కాంగ్రెస్ లో అంతర్గత లొల్లి తప్పదని అంటున్నారు.

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

సొంత పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్ లో జరిగిన పీసీసీ సమావేశంలో మాట్లాడారు. ఎవరికి వాళ్ళే మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మంత్రి పదవులు కోరే వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే వాళ్ళకే నష్టమని అన్నారు. ఎవరికి పదవులు ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుందని రేవంత్ తెలిపారు.

## సరస్వతి పుష్కరాల వెబ్‌సైట్, యాప్ ప్రారంభం



ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు జరిగే ఈ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు ఈ యాప్, వెబ్ పోర్టల్ ఉపయోగపడతాయి. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల కోసం ఘాట్ల విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో పుష్కరాలు ఘనంగా నిర్వహించామనీ, ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలోనే తిరిగి అవకాశం రావడం దేవీ ఆశీస్సులే అన్నారు. తమ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం ఇప్పుడు లేదన్నారు మంత్రి కొండా సురేఖ. ఇప్పటి వరకు సమ్మక్క సారక్క జాతర, భద్రాచలం కళ్యాణం, కొమురవెల్లి కళ్యాణం లాంటి కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా రోజుకు 50 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కాళేశ్వరంలో 17 అడుగుల సరస్వతి విగ్రహం, శాశ్వత మరుగుదొడ్లు, చలువ పందిళ్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వెబ్‌సైట్, యాప్ ద్వారా స్నాన ఘాట్ల సమాచారం, బస్సు సర్వీసులు, రవాణా, భద్రత, వైద్య సేవల వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇది వీడియో స్క్రిప్ట్ లేదా వెబ్/ప్రెస్ కోసం కూడా ఉపయోగించవచ్చు. మరిన్ని మార్పులు సెక్రటేరియట్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ధార్మిక సలహాదారు గోవింద హరి, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ లైన్ దాటితే సహించం

మే 1 నుండి జూన్ 2 వరకు ప్రజలను కలవడానికి తాను కూడా సమయం కేటాయిస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అన్నారు రేవంత్. హెచ్‌సియు భూములపై ప్రతిపక్షాలు కృత్రిమ మేధస్సును ఉపయోగించి అసత్య ప్రచారం చేస్తున్నాయని సీఎం రేవంత్ మండిపడ్డారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి ప్రధానమంత్రి మోడీ కూడా బుల్డోజర్ వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ప్రజల ప్రభుత్వంపై విషపూరిత ప్రచారం చేస్తున్నాయని మండి పడ్డారు. పార్టీ, ప్రభుత్వం యొక్క ప్రతిష్ట పెరిగితేనే మనకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెబుతూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. మనం ప్రజలకు ఎంత మంచి చేస్తున్నామనేది మాత్రమే ముఖ్యం కాదు, ప్రజల్లోకి చేరడం కూడా చాలా ముఖ్యం అన్నారు రేవంత్ రెడ్డి. మళ్లీ గెలవాలంటే ఈ రోజు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. ప్రజల మద్దతుతోనే విజయం సాధ్యమైందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధికి ఏమి కావాలో నివేదిక సిద్ధం చేయండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. అభివృద్ధి పనుల్లో రాజీపడే ప్రసక్తే లేదు. నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. నిన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి తమ ప్రభుత్వాన్ని విమర్శించారని ఇప్పుడు ప్రధానమంత్రి మోడీ కూడా రంగంలోకి దిగారని రేవంత్ అన్నారు. ప్రజల ప్రభుత్వం తెలంగాణలో వరుస పెద్ద పథకాలు ప్రారంభించడంతో మోడీకి ఇబ్బందులు మొదలయ్యాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణ మోడీకి అడ్డంకిగా మారిందని చెప్పుకొచ్చిన సీఎం కుల గణన మోడీకి మరణ శాసనం అవుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చలు జరుగుతున్నాయనే విషయాన్ని ఈ సందర్భంగ చెప్పారు సీఎం రేవంత్. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందులు సృష్టించేందుకు చేతులు కలిపాయన్నారు.

## అబద్దాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ : హరీష్‌రావు

మిగతా 15 లక్షలకు వడ్డీలను మహిళలే కడుతున్నారు. వాస్తవాలు తెలిసి కూడా ఎందుకు జనాన్ని మోసం చేస్తున్నారో చెప్పండి అంటూ భట్టిని నిలదీశారు. గత నవంబర్ 19న వరంగల్‌లో, ఈ ఏడాది మార్చి 8న హైదరాబాద్‌లో రెండు సార్లు సీఎం స్వయంగా చెక్కులు ఇచ్చినా అవి ఇంకా క్లియర్ కాలేదు. ఇది సిగ్గు చేటని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మహిళా సంఘాలకు ఇచ్చిన చెక్కులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల యూనిఫామ్ కుట్టు ఛార్జీల్లోనూ మహిళలకు అన్యాయం జరిగిందని, 50 రూపాయలు ఇచ్చి 75 ఇస్తున్నాం అని చెప్పారు. ఇప్పటికీ మహిళలకు డబ్బులు అందలేదు. వాటిని వెంటనే చెల్లించడంతో పాటు ఇకపై కనీసం రూ.150 చెల్లించాలని మహిళా సంఘాల తరఫున డిమాండ్ చేస్తున్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చే స్త్రీనిధి పరిస్థితి దారుణంగా ఉంది. అందులో 40 శాతం రుణాలు నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ (%చీూూ%)గా మారిపోయాయి. స్త్రీనిధినిమ బలోపేతం చేయాలంటే ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించాలి, లేదంటే ఈ పథకం భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను కోటీశ్వరులని చేస్తాం అని చెప్పిన రేవంత్ రెడ్డి ఏడాదిన్నర పాలనలో ఏం చేశారు? కనీసం లక్షాధికారులైనా చేశారా ? ఇదేనా మీ 'ఇందిరమ్మ రాజ్యం'?" అంటూ హరీష్ రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా మోసపూరిత ప్రచారాలు మానుకోండి. లేనిపక్షంలో మహిళలే మీకు తగిన బుద్ధి చెబుతారు అని హెచ్చరించారు హరీష్ రావు.

## మే 2న ఏపీకి మోడీ : అమరావతికి శంకుస్థాపన

తెలిపారు. భవన నిర్మాణాలను ఎల్ 1 బిడ్డర్ కు అప్పగించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణ కు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేస్తారు. ఎస్సీ వర్గీకరణ పై ఆర్డినెన్స్ జారీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సీఆర్డీయే నిర్ణయాలకు కూడా ఓకే చెప్పింది. అంతేకాకుండా... ఇన్చార్జ్ మంత్రుల పర్యటనల్లో 3 పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. రెవెన్యూ అంశాలను తొందరగా పరిష్కరించాలని కోరారు. సూర్యఘర్ పథకం అమలు మరింత స్పీడప్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## ఆలీ బాబా నలబై దొంగలు సినిమా చూసాం

**- అంతకు మించి తగ్గేది లేదు తగ్గక పోతే**

**- సినిమా చూపిస్తా అని చెక్ పెట్టిన పోలీస్ బాస్‌లు**

**నంద్యాల** అతను కరుడు గట్టిన నిందితుడు ఒకటి రెండు కాదు ఏకంగా 22 కేసుల్లో ముద్దాయి 2019 నుంచి నంద్యాల, గుంటూరు జిల్లాల్లో యదేచ్చగా దారి దోపిడిలు, చోరిలకు పాల్పడుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్న చెంచు హనుమంతు ను ఎట్టకేలకు నంద్యాల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా వెల్లడించిన వివరాల ప్రకారం. పాణ్యం మండలానికి చెందిన చెంచు హనుమంతు అనే వ్యక్తి 2019 నుండి ఇప్పటి వరకు నంద్యాల, గుంటూర్ జిల్లాల్లో దారిదోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పోలీసులకు దొరకుండా తప్పించుకొని తిరుగుతున్న హనుమంతును సుగాలిమెట్ట గ్రామ సమీపంలోని జంబులమ్మ గుడివద్ద అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన సమయంలో అతని వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. తాగుడు, జల్సాలకు అలావాటు పడిన చెంచు హన్మంతు ఈజీ మనీ కొసం దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. అదే ప్రాంతానికి చెందిన దాసరి అంకన్న, చెంచు సుంకన్న, హరిచంద్రుడు అనే నలుగురి వ్యక్తులతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి దోపిడిలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. ఈ ముఠా పాణ్యం, నంద్యాల చుట్టు పక్కల గ్రామాల్లో దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్మును సమానంగా పంచుకొనేవారని, వీరిపై నంద్యాల జిల్లాలో 22 కేసులు ఉన్నట్టు తెలిపారు. 2019 నుంచి పోలీసులకు దొరక్కుండా తప్పించు తిరుగుతున్న ముద్దాయి హనుమంతు ను పట్టుకున్న నంద్యాల జిల్లా పోలీసులను కర్నూల్ డిఐజి కోయల ప్రవీణ్ కుమార్ అభినందించారు.

# పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నాం

**- టిడిఆర్ బాండ్లు అందజేసిన కమిషనర్ ఎన్.మౌర్య**

నగరంలో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ మేళాలో అర్హత పొందిన 22 మందికి సోమవారం టిడిఆర్ బాండ్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరిని ఆన్లైన్ చేయించడం కోసం మేళా నిర్వహిస్తున్నామని అన్నారు 95శాతం ఆన్లైన్ చేశామని, కోర్టు కేసులు, ప్రభుత్వ, టిటిడి భూములు, 22 ఏ కింద ఉన్నవి మాత్రమే పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు ఐదు బాండ్లు ఇచ్చామని, సోమవారం 22 టిడిఆర్ బాండ్లు లబ్ధిదారులకు స్వయంగా అందజేశామని అన్నారు. ఖాళీ జాగాలకు లొకాలిటీ వాల్యూ ప్రకారం గుర్తించామని అన్నారు. టిడిఆర్ బాండ్ల కమిటీ సమావేశమై 96 మందికి ప్రీ అప్రూవల్ తీసుకుని అర్హత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇస్తే తరువాత బాండ్లు అందజేస్తామని అన్నారు. వీరు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆర్.డి, విజయభాస్కర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ మహా పాత్ర, ఏసీపి లు బాలాజి, మూర్తి, పాల్గొన్నారు.

## గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం..

**- కమిషనర్ ఎన్ మౌర్య**

**తిరుపతి** తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, అన్ని విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర వైశిష్ట్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థ తరపున చేయాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.

## జపాన్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, షార్ప్ న్యూస్ : తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడును ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్ళారు. ఈ నెల 16 నుంచి 22 వరకు అక్కడే పర్యటిస్తారు. మంగళవారం నాడు సీఎల్పీ సమావేశం తర్వాత అన్ని పనులు ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి జపాన్ కు బయల్దేరి వెళ్ళారు. సీఎంతో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు కూడా వెళ్ళారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో జపాన్ పర్యటన కొనసాగనుంది. ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్‌పో లో సీఎం రేవంత్ పాల్గొంటారు. తర్వాత టోక్యోలో పెట్టుబడులపై పారిశ్రామికవేత్తలతో సమావేశం జరగనుంది. ఆ దేశంలో లేటెస్ట్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత అభివృద్ధిపై అధికారుల బృందం స్టడీ చేయనుంది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ టెక్నాలజీని స్టడీ చేయడంతో పాటు, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి వ్యాపారవేత్తలను, వివిధ సంస్థలను ఆహ్వానిస్తారని తెలుస్తోంది.

## కులమతాలను రెచ్చగొడుతున్న జగన్

అమరావతి, షార్ప్ న్యూస్ బ్యూరో : మాజీ సీఎం వైయస్ జగన్ రాష్ట్రంలో కులమాతాలను రెచ్చగొడుతున్నాడని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఎస్వీ గోశాల, పాస్టర్ ప్రవీణ్, వక్ఫ్ బిల్లు విషయంలో ఆయన మతాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఏపీ కేబినెట్ మీట్ తర్వాత వివిధ అంశాలపై బాబు మంత్రులతో మాట్లాడారు. జగన్ వైఖరి ఎలా ఉందో కళ్ళ ముందు కనిపిస్తుందని అన్నారు. ఆయన కుట్రలను తిప్పికొడుతూనే జనాన్ని కూడా చైతన్య పరచాలని చంద్రబాబు మంత్రులకు సూచించారు. అధికారుల అవినీతిపైనా కేబినెట్ లో చర్చకు వచ్చింది. ఏ శాఖ పరిధిలో మంత్రులు ఆ శాఖ అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఇన్చార్జి మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలన్నారు. సీఎంగా తన మొదటి ప్రయాణం మొదలు పెట్టినప్పుడు అభివృద్ధిలో హైదరాబాదు రెండో స్థానంలో ఉన్నట్లు గుర్తుందన్నారు. ఇప్పుడు హైదరాబాద్ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ సిటీగా ఎదిగినట్టు చంద్రబాబు చెప్పారు. . వృద్ధి రేటులో ఏపీని రెండో స్థానంలో పెట్టడం తన ముందు ఉన్న కొత్త సవాల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఆ సవాలును అవకాశంగా భావిస్తున్నాననీ, మరింత కష్టపడి పని చేస్తానని చెప్పారు.

## అయోధ్య ఆలయానికి బాంబు బెదిరింపు ?

అయోధ్య : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయోధ్య శ్రీరామాలయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భద్రత సిబ్బందిని పెంచి పహారా కాస్తున్నారు. దీనిపై ఆలయ అధికారులు, పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధికారిక మెయిల్ ఐడీకి ఆదివారం రాత్రి బెదిరింపు మెయిల్ వచ్చినట్లు స్థానిక మీడియా తెలిపింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఆలయ పరిసరాల్లో భద్రతను పెంచి, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఈ బెదిరింపు మెయిల్ తమిళనాడు నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. రాముడి ఆలయానికి ప్రమాదం ఉన్నట్లు ట్రస్ట్ కి అనుమానాస్పద మెయిల్ వచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. తమిళనాడు నుంచి ఇంగ్లీష్ లో ఈ మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. అంతకుముందు కూడా అయోధ్య రామాలయానికి ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. రామమందిరాన్ని బాంబులు పెట్టి పేల్చేస్తామంటూ ఖలీస్థానీ ఉగ్రవాది పన్నూ కూడా బెదిరించాడు. బిహార్ భగల్పూర్ కు చెందిన మక్సూద్ అన్సారీ కూడా ఆర్డీఎక్స్ పెట్టి పేలుస్తానంటూ బెదిరించాడు.

# ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు

కామారెడ్డి జిల్లా (షార్ప్ న్యూస్): పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇదిగో ఆనవాళ్లు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బాన్సువాడ దగ్గర్లోని మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్ డ్యాంను ఆమె సందర్శించారు. మండు వేసవిలోనూ మత్తడి దుంకుతున్న ఈ చెక్ డ్యాంను చూస్తే, కేసీఆర్ తెలంగాణను పచ్చగా చేయడానికి పడిన తపన గుర్తుకొస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మంజీరా నదిపై ఇలాంటివి నాలుగు చెక్ డ్యాంలు నిర్మించారు. రైతులు వాన కోసం ఎదురు చూడకుండా పంటలు పండించుకునేలా కేసీఆర్ చేశారన్నారు. ఈ ఒక్క చెక్ డ్యాంపై ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నట్టు కవిత వివరించారు.

# తడిసి ముద్దయిన భాగ్యనగరం

**హైదరాబాద్** హైదరాబాద్‌లో విచిత్ర వాతావరణం ఏర్పడింది. మంగళవారం రోజు మధ్యాహ్నాం నగరంలో అనూహ్యమైన వాతావరణ మార్పు చోటుచేసుకుంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో అల్లాడిన నగరవాసులకు ఒక్కసారిగా ఉపశమనం లభించింది. అప్పటివరకు భానుడు నిప్పులు కురిపించగా ఉన్నట్టుంది దట్టమైన మేఘాలు ఆవరించి కొద్ది నిమిషాల్లోనే భారీ వర్షం కురిసింది. జోరువాన కురుస్తున్న సమయంలోనే వడగండ్లు కూడా మొదలయ్యాయి. మరింత ఆశ్చర్యంగా ఒకవైపు వడగండ్లతో కూడిన వర్షం కురుస్తుంటే మరోవైపు ఎండ కూడా తోడవటంతో నగరంలో ఒక విచిత్రమైన వాతావరణం నెలకొంది. ఈ అసాధారణ దృశ్యం నగరవాసులను ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. గచ్చిబౌలి, పటాన్‌చెరు, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, కొండాపూర్, హైటెక్ సిటీ, మియాపూర్, లింగంపల్లితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ ఆకస్మిక వాతావరణ మార్పుతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు. అయితే, భానుడి తాపం నుంచి కాస్త ఉపశమనం లభించడంతో నగరవాసులకు కొంతమేర సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జోరు వర్షంతో నగరాన్ని తడిపేసిన వరుణుడు కాసేపటికే సెలవు తీసుకున్నాడు. అప్పటివరకు కురిసిన వర్షంతో నగరంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షపు జల్లుతో చల్లగా మారిన వాతావరణానికి ప్రకాశవంతమైన ఎండ కూడా తోడవటం నగరవాసుల మనసును ఉల్లాసపరిచింది. వర్షం తాలూకు చల్లని గాలులు, పైనుంచి ఎండ కలగలిపిన వాతావరణాన్ని నగరాసులు ఆస్వాధించారు. వర్షం కురిసిన సమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలగ్గా కాసేపటికే వర్షం తగ్గిపోవటంతో నెమ్మదిగా ట్రాఫిక్ కూడా క్లియర్ అయ్యింది. మళ్లీ ఎప్పటిలా వాహనాలు రాకపోకలు సాగించాయి. అయితే మధ్యాహ్నాం సమయంలో వర్షం పడటం వల్ల ట్రాఫిక్ మీద పెద్దగా ప్రభావం చూపించలేదు కానీ సాయంత్రం సమయంలో ఆఫీసులు వదిలేప్పుడు పడితే మాత్రం వాహనదారులు కాస్త ఇబ్బందులు పడేవాళ్లు.

# పింక్ బుక్ ఓపెన్ చేశాం..



తమ పార్టీ కార్యకర్తలను ఎవరెవరు బెదిరిస్తున్నారు? వారి పేర్లు రాసుకోవడం మొదలెట్టాం... కాలం వచ్చినప్పుడు చూస్తామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కవిత హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు ఈడ్చినవాళ్లను కూడా క్షమించేది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎంతటి స్థాయిలో ఉన్నా... బీఆర్ఎస్ కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమని చెప్పారు. "వాళ్ల తాతలు వచ్చినా, ముత్తాతలు వచ్చినా, జేజమ్మలు వచ్చినా భయపడేది లేదు" అన్నారు కవిత. కాంగ్రెస్ నేతలు ఇంటింటికి తిరుగుతూ "గ్యారెంటీ కార్డులు" ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. "సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన కార్డులు పంచి, జనం దగ్గర ఓట్లు తీసుకున్నారు... ఇప్పుడు వాటిని అమలు చేయకపోవడం మోసం కాదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఒకటిన్నరేళ్ల పాలనలోనే ప్రజల వ్యతిరేకత సంపాదించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా నోబెల్ ప్రైజ్ ఇవ్వాలి! అని వ్యంగ్యంగా విమర్శించారు కవిత. ప్రతి ఇంటి నుంచి ఒకరు బీఆర్ రజతోత్సవ సభకు రావాలని కోరారు.

# వారంలో ఏపీ టెన్త్ రిజల్ట్స్



అమరావతి, షార్ప్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ మరో వారం రోజుల్లో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదల కాబోతున్నాయి. రాష్ట్రంలో ఏప్రిల్ 1నాటికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ఆన్సర్ షీట్లు దిద్దే కార్యక్రమం ఈనెల 3 నుంచి ప్రారంభమై, 9 కల్లా పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 26 జిల్లా కేంద్రాల్లో పేపర్ల మూల్యాంకనం చేపట్టారు. ప్రస్తుతం మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్నారు. ఇది కూడా దాదాపు ఫైనల్ స్టేజ్ కి చేరుకుంది. దీంతో వారం లోపు పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడించేందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సవ్యంగా కుదిరితే ఈనెల 22న టెన్త్ ఫలితాలు విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఎప్పుడెప్పుడా అని టెన్త్ ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు మరో వారంలో తెరపడనుంది

## పారిశుధ్య కార్మికులకు లస్సీ, మజ్జిగ పంపిణీ

**చిలకలూరిపేట, (షార్ప్ న్యూస్):** ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ పార్క్ దగ్గర పారిశుధ్య కార్మికులకు లస్సీ, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అడపా అశోక్, శానిటరీ ఇన్స్పెక్టర్ సునీత పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు పిలుపుతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండాకాలంలో శ్రమించే పారిశుధ్య కార్మికులకు చల్లదనం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని, ఆరోగ్య పరిరక్షణలో సహకరిస్తుందన్నారు ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అడపా అశోక్. సామాజికంగా పారిశుధ్య కార్మికుల సేవను గుర్తించి, వారిని గౌరవించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సాయం అందరూ చేయాలని పిలుపు ఇచ్చారు తోట మల్లికార్జునరావు. పారిశుధ్య కార్మికుల కష్టాన్ని గుర్తించి వేసవిలో రిలీఫ్ ఇచ్చే కార్యక్రమం నిర్వహించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు శానిటరీ ఇన్స్పెక్టర్ సునీత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ దరియా వలి, కొచ్చర్ల చందు, సుందర్ బాబు, కొండెపాటి రమేష్, బైరా సతీష్, బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ సినిమాలకు పిల్లల్ని రానీయొద్దు : సీపీ





నిజామాబాద్, షార్ప్ న్యూస్ : నిజామాబాద్ జిల్లాలో ఎ సర్టిఫికెట్ కలిగిన పెద్దల సినిమాలను మైనర్లు చూడటానికి అనుమతించవద్దని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. థియేటర్ల యాజమాన్యాలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తున్నామని, దీనివల్ల మహిళలు, పిల్లలు అసౌకర్యానికి గురవుతున్నట్టు తెలిపారు. రోడ్లపై అసభ్య ప్రవర్తన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా విగ్రహాలు ప్రతిష్టించవద్దనీ, జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో, పార్కుల్లో, ఐలాండ్స్ లో, ప్రభుత్వ భవనాల దగ్గర విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అన్నారు. డీజే ల సౌండ్ ఎక్కువగా ఉండటం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీ చెప్పారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి 10 గంటల నుంచి ఉదయం ఆరంటి దాకా 55 డెసిబెల్స్ లోపు శబ్ద స్థాయితో ఉండాలి. అంతకు మించి డీజే సౌండ్ వాడకాన్ని నిషేధిస్తున్నట్టు సీపీ సాయి చైతన్య తెలిపారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సూచించారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు వారి వివరాలను పోలీసులకు తెలపాలి. అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సీపీ సాయి చైతన్య కోరారు.

## అందాల పోటీల్ని రద్దు చేయాలి



**నిజామాబాద్ జిల్లా (షార్ప్ న్యూస్):** తెలంగాణలో జరిగే 72వ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని వామపక్ష మహిళా సంఘాలు, యువజన, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నిజామాబాద్ లోని ఎన్.ఆర్.భవన్ కోటగల్లి ఆఫీసులో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి. గోదావరి, కే. సంధ్యారాణి అధ్యక్షత వహించారు. హైదరాబాదులో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం అంటే తెలంగాణ మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయటమే అన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలు, రాజకీయ నాయకులకు మహిళ అంగడి సరుకుగా మారిందన్నారు. మహిళలు జీరో సైజు కోసం అనేక రకాల రసాయనాలు, కాస్ట్యూమ్స్ వాడటం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. మహిళలను పూజించే మన దేశంలో సరుకుగా చేయడం దుర్మార్గమన్నారు మహిళా సంఘాల నేతలు. మిస్ వరల్డ్ 72వ మిస్ వరల్డ్ పోటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ, భారతి, పిడిఎస్ యు. జిల్లా అధ్యక్షులు నరేందర్, నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతిలో అప్పీలు వ్యవస్థ

**జగిత్యాల** భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా14 ఏప్రిల్2025 న ప్రారంభించిన భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల అసోసియేషన్ జగిత్యాల మాజీ అధ్యక్షుడు ,న్యాయవాది హరి అశోక్ కుమార్ ప్రజల సమాచారం కోసం తెలిపారు. తహశీల్దార్లు జారీ చేసే పాస్ పుస్తకాల్లో లేదా భూదార్ పై ప్రజాలకెవరికయిన అభ్యంతరాలుంటే రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)కి అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టంలో సెక్షన్ 15,నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది.ఆర్డీవో ఇచ్చిన తీర్పు పై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ కు రెండో దశలో అప్పీలు చేసుకోవచ్చు.ఆర్డీవో చేసిన మ్యుటేషన్ల పై లేదా ఆర్డీవో చేసిన సాదాబైనామాల క్రమబద్ధీకరణపై ఎవరికయినా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకునేందుకు వీలుంది.కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరాలుంటే భూమి ట్రిబ్యునల్ లో అప్పీలు చేసుకోవచ్చు.ఇలా అప్పీలు చేసుకునేందుకు వ్యవస్థ ధరణి చట్టంలో అవకాశం లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భాదితులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది.ఈ ప్రధాన లోపాన్ని సవరిస్తూ భూ భారతి చట్టం లో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పీలు వ్యవస్థ కు అవకాశం కల్పించినట్లు హరి అశోక్ కుమార్ వివరించారు.

# పేరుకే హెల్త్ సిటీ.. అబ్బో భరించలేం





విశాఖపట్నం, షార్ప్ న్యూస్ : విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో హెల్త్ సిటీ పేరుతో అభివృద్ధి చేపడుతున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా విరుద్ధంగా ఉంది. ఈ ప్రాంతాన్ని చూస్తే ఇది హెల్త్ సిటీ కాదు... మినీ డంపింగ్ యార్డు అన్నట్టుగా కనిపిస్తోంది. . హాస్పిటల్స్‌కి దగ్గరగా ఉన్న ఖాళీ ప్రదేశాలు చెత్త కుప్పలతో నిండిపోయాయి. అక్కడ మెడికల్ వ్యర్థాలు, మలవిసర్జనలు, మందుబాబుల హల్‌చల్ రోజు రోజుకీ పెరుగుతోంది. నిర్మాణాల వ్యర్థాలు, మట్టికుప్పలు పేరుకుపోతున్నాయి. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. హెల్త్ సిటీ పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో చుట్టూ ఫెన్సింగ్ లేకుండా వదిలేయడం వల్ల అక్కడ చెత్త వేయడం కామన్ గా మారింది. ఖాళీ స్థలాలపై నిర్మాణాలు చేపట్టకపోతే, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ఖాళీ స్థలాల మీద ట్యాక్సులు కూడా సరిగా వసూలు చేయడం లేదు. హెల్త్ సిటీలో రోడ్లు, వీధి దీపాల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. స్ట్రీట్ లైట్ల ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళల్లో అక్కడ చీకటి అలుముకుంటోంది. దాంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడే టూరిస్ట్ బస్సులు, ఇతర వాహనాలు అనధికారికంగా పార్క్ చేస్తున్నారు. పేషెంట్ల తోడుగా వచ్చే బంధువులు, రోగుల సహాయకులు, రోజూ హెల్త్ సిటీకి వచ్చేవాళ్లు అక్కడ కనీసం మరుగుదొడ్లు, స్నాన గదులు కూడా లేవని వాపోతున్నారు. పే అండ్ యూజ్ వాష్ రూములు నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వాలి. ఆ స్థలాల్లో ఫెన్సింగ్ వేయించాలి. హెల్త్ సిటీ పేరుకే కాకుండా నిజంగా ఆరోగ్యకరంగా ఉండే



వాతావరణం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఫార్మాసిటీలో డేంజర్ కెమికల్స్

## కార్మికుల్లో భయం





**పరవాడ, షార్ప్ న్యూస్ :** అనకాపల్లి జిల్లాలోని పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఉన్న కొన్ని చిన్నతరహా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతను గాలికొదిలేశాయి. ఇక్కడ సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల తరచూ కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పరిశ్రమల్లో కొన్ని యాజమాన్యాలు ఈపీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలను కూడా అందించకుండానే కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఓ పరిశ్రమ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు ఫైనల్ ప్రొడక్ట్ తయారీకి అవసరమైన క్లీన్ రూమ్ కూడా ఏర్పాటు చేయలేదు. గత 20 నెలలుగా కార్మికుల నుంచి ఈపీఎఫ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నా, అధికారికంగా EPF ఖాతాల్లో వేయట్లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈపీఎఫ్ అధికారులకు తక్కువ మంది కార్మికుల వివరాలు చూపించి మభ్యపెడుతున్నట్టు తెలుస్తోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, అనుమతులు లేకుండా హైడ్రోజన్, అమ్మోనియం, నైట్రోజన్, ఆక్సిజన్, క్లోరిన్, మోనోమిథైల్, ఎంఎంఏ లాంటి ప్రమాదకర గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. వీటిని భార్గవి కెమికల్స్ నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. కొన్ని పరిశ్రమలు స్ప్రింక్లర్స్ లేకుండా సాల్వెంట్ ట్యాంకులను నడుపుతున్నాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. బాయిలర్ చిమ్నీలకు బ్యాగ్ ఫిల్టర్లు అమర్చకపోవడం వల్ల గాఢమైన నల్ల పొగతో కార్మికులు, స్థానికులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లేబర్ చట్టం ప్రకారం జీతాలు ప్రతీ నెల 10 లోపు చెల్లించాలి. కానీ కొన్ని పరిశ్రమలు 20 తర్వాతే జీతాలు ఇస్తున్నాయి. అయినా కార్మిక శాఖ అధికారులు స్పందించడం లేదు. రాసాయన వ్యర్థాల తరలింపునకు అవసరమైన ఫ్లోమీటర్లను నియంత్రించకుండా, పరిశ్రమలు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నాయి. గతంలో అచ్యుతాపురంలో జరిగిన అగ్నిప్రమాదం తరువాత ఏర్పాటు చేసిన హై లెవెల్ కమిటీకి కూడా తప్పుడు సమాచారం ఇస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతి మూడు నెలలకు పరిశ్రమ తనిఖీకి వచ్చే డ్రగ్, పీసీబీ, ఫ్యాక్టరీ, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ అధికారులను బురిడీ కొట్టించి, తాము అన్ని నిబంధనలు పాటిస్తున్నట్టు నమ్మిస్తున్నాయి పరిశ్రమలు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, ఫార్మాసిటీలో ఉన్న చిన్న తరహా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# అలిపిరిలో బేస్ క్యాంప్ - బస్సుల్లోనే కొండపైకి!

**- తిరుమలలో టీటీడీ సంస్కరణలు**

**- భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు**

**- అలిపిరిలోనే అన్ని సౌకర్యాలు**



**తిరుపతి, షార్ప్ న్యూస్ :** తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. శ్రీవారి దర్శనంలో ఏఐ టెక్నాలజీ వినియోగించబోతోంది. అందుకోసం ప్రతి భక్తుడికీ పర్మినెంట్ ఐడీ ఇస్తారు. అలాగే తిరుమల విజన్-2047 అమలు దిశగా కార్యాచరణ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అలిపిరి దగ్గరే బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 15 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు సిద్దం అయ్యాయి. అలిపిరి దగ్గర ప్రైవేట్ వాహనాలు నిలిపివేసి, ఎలక్ట్రిక్ బస్సుల్లో కొండ పైకి భక్తులను తీసుకెళ్తారు. దాంతో శ్రీవారి దర్శనం కోసం వెళ్లే భక్తులు అన్ని రకాల సేవలను అలిపిరిలోనే పొందే అవకాశం ఉంటుంది. ఈ బేస్‌క్యాంప్ కోసం 10 నుంచి 15 హెక్టార్ల స్థలాన్ని వినియోగించనున్నారు. గతంలో వివిధ హోటళ్లకు ఇచ్చిన స్థలాన్ని కూడా రద్దు చేసి టీటీడీకే కేటాయించడంతో బేస్‌క్యాంప్‌కు లైన్ క్లియర్ అయింది. ఇటీవల టీటీడీపై సమీక్షలో కూడా సీఎం చంద్రబాబు ఒకే చెప్పారు. దాంతో పనులు స్పీడప్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. తిరుమలలో పెరుగుతున్న వాహనాల రద్దీ తగ్గించడానికి ప్లాన్ రెడీ చేస్తున్నారు. భక్తులకు సౌకర్యాలతో పాటుగా వాహన రద్దీ, కాలుష్యం తగ్గించేలా బేస్ క్యాంపులో సౌకర్యాలు కల్పిస్తారు. సైలెంట్ జోన్‌లో ఉండాల్సిన తిరుమల కమర్షియల్ జోన్‌లోకి వెళ్లిపోయింది. తిరుమలలో రోజుకు సగటున 68 వేల మంది భక్తులతో పాటు 20 వేల మంది స్థానికులకు నీటి, విద్యుత్ వనరులు కల్పించడం కష్టమవుతోంది. భక్తుల కోసం తిరుమలలో 7,790 టీటీడీ గదులు, 1,105 మఠాల గదులు, 6,800 లాకర్లు ఉన్నాయి. వీటితో 55 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంటోంది. మిగిలిన భక్తులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం కోసమే బేస్ క్యాంప్ ప్రాజెక్ట్‌పై టీటీడీ దృష్టి పెట్టింది.

### బేస్ క్యాంప్‌లో ఏముంటాయి !

అలిపిరిలో ఏర్పాటు చేసే బేస్ క్యాంప్ లో 25 వేల మంది భక్తులకు వసతి సౌకర్యాలు కల్పిస్తారు. తిరుపతికి చేరే ప్రైవేట్ వాహనాలను ఈ బేస్ క్యాంప్‌కు మళ్లించి వాటిల్లో వచ్చిన భక్తులను టీటీడీ, ఏపీఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా తిరుమల కొండ మీదకు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం ప్రత్యేక సెంటర్, మోడల్ ట్రాన్స్‌ఫర్ టెర్మినల్ ఏర్పాటు చేస్తారు.

భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు, స్నానాలు చేసేందుకు, భోజనం హాళ్లు, లాకర్లు లాంటి సదుపాయాలు కల్పిస్తారు. భక్తులకు వసతితో పాటు వివిధ రకాల కౌంటర్లను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తారు. మ్యూజియం, కళాప్రదర్శన కేంద్రం, ఆధ్యాత్మికతను పెంచేలా వివిధ రకాల కేంద్రాలు ఉంటాయి. సాధ్యమైనంత త్వరగా ఈ బేస్ క్యాంపు అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నాయి

# పొంగులేటిపై అనుచిత వ్యాఖ్యలు



సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) షార్ప్ న్యూస్: బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చా నేతలు తీవ్రంగా ఖండించారు. మంగళవారం జరిగిన సమావేశంలో జొన్నలగడ్డ నరేష్, బానోత్ విజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. పొంగులేటి అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తూ శుభ్రపరుస్తుండగా, కాలు జారి పడ్డారని, దీనిని కావాలనే తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ నేతలు అంబేద్కర్‌ను శపించాడని వ్యాఖ్యానించడం అమర్యాదగా ఉందన్నారు. అంబేద్కర్‌పై బీజేపీ గౌరవాన్ని తక్కువచేయాలనే ఉద్దేశంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో భట్టి విక్రమార్క తప్ప మిగతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గతంలో అనేక పార్టీలు మారిన వాళ్ళే అన్నారు బీజేపీ నేతలు. వారంతా అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరారని, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయాల్లో ఉన్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే, వీరంతా మళ్లీ అధికారంలోకి వచ్చే పార్టీలో చేరతారు అని వ్యాఖ్యానించారు. పొంగులేటి సుధాకర్ రెడ్డి ఎప్పుడూ కుల, మతాలకు అతీతంగా నడుచుకున్న వ్యక్తి అన్నారు బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చా నేతలు. ప్రతి కులానికి చెందిన వ్యక్తి రాజకీయంగా ఎదగాలని ఆయన కోరుకునే నేత అని అన్నారు. ఈ సమావేశంలో వీరంరాజు, పాలకొల్లు శ్రీనివాస్ (సత్తుపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు), పర్శ రాంబాబు, మట్ట ప్రసాద్, మంద శివ యాదవ్, మెరుగు శేషగిరిరావు, తెనాలి అశోక్, ఆచంట నాగస్వామి, సుబ్రహ్మణ్యం, మైనార్టీ మోర్చా నాయకులు షేక్ రహితుల్లా తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో ఎస్బీఐలో భారీ అగ్నిప్రమాదం



వికారాబాద్ జిల్లా, షార్ప్ న్యూస్ : తాండూరు మండలం కరన్‌కోట్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) శాఖలో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 9:30 గంటలకు బ్యాంక్ సెక్యూరిటీ గార్డు తాళాలు తీసిన వెంటనే, తీవ్రంగా పొగలు ఎగసిపడటాన్ని గమనించారు. వెంటనే పై అధికారులకు తెలియజేయగా, వారు వచ్చేసరికి మంటలు విస్తృతంగా వ్యాపించాయి. దగ్గర్లో ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కోడంగల్ నుంచి ఫైర్ ఇంజిన్ రప్పించాల్సి వచ్చింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావచ్చని అనుమానిస్తున్నారు. బ్యాంక్ భవనంపై ఈ మధ్యే థర్మోకోల్ షీట్స్‌తో పైకప్పు నిర్మించారు. ఇవి మంటలు వేగంగా వ్యాపించడానికి కారణమైనట్టు భావిస్తున్నారు. మంటలతో బ్యాంకు చుట్టుపక్కల ప్రాంతంలో పొగలు విపరీతంగా వ్యాపించాయి. దాంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు .

## మన చంద్రన్న - అభివృద్ధి,సంక్షేమ విజనరీ పుస్తకావిష్కరణ



అమరావతి, షార్ప్ న్యూస్ బ్యూరో : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం 'మన చంద్రన్న – అభివృద్ధి, సంక్షేమ విజనరీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టీ.డి. జనార్ధన్ రూపొందించారు. ఈ పాకెట్ సైజ్ పుస్తకం దాదాపు 700 అంశాలతో రూపొందించారు. చంద్రబాబు బాల్యం నుంచి చదువులు, విద్యార్థి నాయకుడిగా ఉన్న కాలం, రాజకీయ ప్రవేశం వరకు జరిగిన విశేషాలను చిత్రాలతో సహా అందించారు. చంద్రబాబు ఎమ్మెల్యే, మంత్రి హోదాల్లో చేసిన సేవలు, మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాలు, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటు కోసం పోషించిన కీలకపాత్ర లాంటి విషయాలు ఇందులో పొందుపరిచారు. అలిపిరి బాంబు దాడి, "వస్తున్నా మీకోసం" పాదయాత్ర, ప్రజా పోరాటాలు లాంటి సంఘటనలను కూడా వివరించారు. బాబు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రవేశపెట్టిన ప్రజా పాలసీలు, అవి ఏ విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడ్డాయో, దేశవ్యాప్తంగా ఎలా గుర్తింపు పొందాయో పుస్తకంలో వివరించారు. వ్యవసాయాభివృద్ధి, నదుల అనుసంధానం లాంటి విషయాలతో సహా మొత్తం 700 అంశాలను చేర్చి చిన్న పరిమాణంలో ఈ పుస్తం ప్రింట్ చేశారు.

# ఈవీఎంలపై అనుమానాలు ఎందుకు ?





**(హైదరాబాద్, షార్ప్ న్యూస్ ):** దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల వాడకంపై మళ్ళీ అనుమానాలు మొదలయ్యాయి. అమెరికా ఇంటలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్, భారత ఈవీఎంలు హ్యాక్ అవుతాయంటూ వ్యాఖ్యలు చేశారని కొందరు ప్రచారం చేస్తున్నారు. ఆమె ఏం మాట్లాడారో తెలుసుకోకుండా భారత్ లో ఈవీఎంలపై మళ్ళీ చర్చ మొదలైంది.

### ఓడినప్పుడే ఈవీఎంలో లోపాలా ?

దేశంలో ఈమధ్యకాలంలో చాలా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వాటిల్లో కొన్ని కాంగ్రెస్ గెలుచుకుంటే, ఎక్కువ శాతం బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ఖాతాలో పడ్డాయి. అయితే బీజేపీ గెలిచిన రాష్ట్రాల్లో ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయనీ, ఆ పార్టీ నేతలు మిషన్లను హ్యాక్ చేసి ఫలితాలను తారుమారు చేశారని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు తీవ్ర ఆరోపణలు చేశాయి. మహారాష్ట్రతో పాటు హర్యానాలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. అయితే అంతకుముందు కర్ణాటక, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ గెలిచినప్పుడు మాత్రం ఆ పార్టీ నుంచి ఇలాంటి ఆరోపణలు ఎందుకు రాలేదు అన్న ప్రశ్నలకు ఇప్పటికీ ఎవరూ సమాధానం చెప్పట్లేదు. దురదృష్టవశాత్తూ రాజకీయపార్టీలు ఓడిపోయినప్పుడల్లా ఫలితాలను ప్రశ్నిస్తున్నాయి. ఈవీఎంల మ్యాజిక్ అంటున్నాయి. హ్యాక్ అవుతున్నాయని గగ్గోలు పెడుతున్నాయి. అంతేకాదు... ఇతర దేశాల్లో ఎవరైనా ఈవీఎంలపై మాట్లాడితే చాలు... వెంటనే మన దేశంలో అలజడి మొదలవుతుంది. మళ్ళీ బ్యాలెట్ పేపర్ విధానం తేవాలంటూ పార్టీలు తమ స్వరం వినిపిస్తున్నాయి.

### తులసి గబ్బార్డ్ అన్నదేంటి ?

ఈవీఎంల పని తీరు గురించి అమెరికా ఇంటలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ మాట్లాడింది నిజమే. కానీ ఆమె మాట్లాడింది ఇండియాలో ఈవీఎంల గురించి కాదు. ఇతర దేశాల్లో అని మాత్రమే అన్నారు. అంటే ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉండే ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని తులసీ గబ్బార్డ్ అన్నారు. కానీ భారత్ లో వాడుతున్న ఈవీఎంలు ఇంటర్నెట్ తో హ్యాక్ అయ్యే అవకాశమే లేదు. ఎందుకంటే మన ఈవీఎంలకు కనెక్ట్ చేయడానికి బ్లూటూత్, వైఫై లాంటి పరికరాలు ఏమీ లేవు. అసలు ఒక ఈవీఎంకు మరో దానికీ సంబంధమే ఉండదు. అందువల్ల కనెక్ట్ అయ్యే అవకాశమే లేదు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిసారీ చెబుతూనే ఉంది. సుప్రీంకోర్టులో కేసుల సందర్భంగా కూడా చెప్పింది. కానీ చాలా మంది ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని ప్రచారం చేస్తున్నారు. అయితే ఏ ఒక్కరూ దాన్ని నిరూపించలేకపోయారు.

### ఓడినప్పుడే ఈవీఎంలపై నిందలు

మన దేశంలో ఈవీఎలంను వ్యతిరేకించని పార్టీ లేదు. చివరికి బీజేపీ కూడా ఈవీఎంలను అప్పుడప్పుడూ వ్యతిరేకిస్తూ ఉంటుంది. అదీ ఎప్పుడంటే తమకు ఓటమి ఎదురైనప్పుడు మాత్రమే. ఈవీఎంలపై సుప్రీంకోర్టుకు కూడా వెళ్లింది టీడీపీ. ఈవీఎంలను మించిన సెక్యూరిటీ ఓటింగ్ లేదని గతంలో వాదించిన జగన్ రెడ్డి కూడా ఇప్పుడు వాటిని నిందిస్తున్నారు. అయితే రాజకీయ పార్టీలతో వచ్చిన సమస్య ఏమిటంటే.. తాము ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలను తప్పుబడుతున్నారు. అదే గెలిచినప్పుడు మాత్రం సమర్థిస్తున్నారు. దీని వల్ల వారి వాదనకు బలం ఉండటం లేదు.

### మళ్లీ బ్యాలెట్లు కష్టమే !

భారత ఈవీఎంలు చాలా పకడ్బందీగా ఉంటాయని చెబుతారు కొందరు నిపుణులు. ఓటు వేసినప్పుడు ఎవరికి ఓటు వేశామో ప్రింట్ వస్తుంది. దాన్ని ఓటు వేసే వారు చూస్తారు. వేరే వారికి ఓటు పడితే తెలిసిపోతుంది. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఇప్పటి వరకూ రాలేదు.

అయితే ఇక్కడ ఆ ప్రింట్లు అన్నింటినీ లెక్కించేందుకు ఈసీ ఒప్పుకోవడం లేదు. ర్యాండమ్‌గా కొన్ని మాత్రమే లెక్కిస్తున్నారు. అన్నింటినీ లెక్కిస్తే.. ఈవీఎంలపై అనుమానాలు కొంత వరకూ తీరే అవకాశముంది. ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో ఈవీఎంల మీద అనుమానాలు ఇంకా పెరిగిపోతూనే ఉన్నాయి. అలాగని ఈవీఎంలను తీసేసి బ్యాలెట్ పేపర్లు ప్రవేశపెట్టడం అనేది మన దేశంలో చాలా కష్టం. దేశంలో 99 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అన్ని ఎన్నికల్లోనూ సగటున 60 నుంచి 80శాతం దాకా పోలింగ్ నమోదవుతోంది. అంటే దాదాపు 70 కోట్ల మంది దాకా ఓట్లు వేస్తున్నారు. ఇన్ని ఓట్లను మళ్ళీ పేపర్ల రూపంలో లెక్కించడం అంటే చాలా రోజులు పట్టే అవకాశం ఉంది. వందల కోట్ల రూపాయల ఖర్చవుతాయి. పైగా ఎన్నికల్లో గెలుపును ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. దాంతో బ్యాలెట్ పేపర్ వాడితే గతం కంటే ఇంకా పెద్ద సంఖ్యలో హింసాత్మక ఘటనలు జరిగే ఛాన్సుంది. బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లు వేయడం, రీపోలింగ్ లాంటి సమస్యలు చుట్టుముట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మళ్ళీ బ్యాలెట్ పేపర్ విధానం అనేది సాధ్యం కాదనే చెప్పాలి. అయితే పార్టీలు కూడా పోలైన ఓట్లలో తేడాలు వస్తే తప్ప, ఈవీఎంలను తప్పుబట్టడం మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అమరావతి విస్తరణకు 44వేల ఎకరాలా ?

**(అమరావతి, షార్ప్ న్యూస్ ):** కూటమి ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ కి కొత్త రాజధాని నగరాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అందుకోసం రెండోసారి పదవిలోకి రాగానే మళ్ళీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పుడు అమరావతి విస్తరణపైనా ప్రభుత్వం దృష్టిపెట్టింది. అయితే రాజధాని నిర్మాణానికి మరో నలభై నాలుగు వేల ఎకరాలు భూసేకరణ చేయాలని డిసైడ్ అయినట్టు తెలుస్తోంది. దీనిపై అమరావతి ఏరియాలో ఇప్పటికే కొందరు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కూడా జరిగింది. 11 గ్రామాల పరిధిలో ఈ భూసేకరణ లేదా సమీకరణ ఉండే చాన్స్ ఉందంటున్నారు. అయితే భూమిని రైతులు ఇస్తారా లేదా అన్నది పక్కన పెడితే... అసలు కూటమి ప్రభుత్వానికి ఇప్పుడు ఎందుకంత తొందర అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పటికే సేకరణ చేసిన 33 వేల ఎకరాల్లో అమరావతి పనులు రీస్టార్ట్ కాలేదు. దాన్ని అభివృద్ధి చూపించిన తర్వాత... మళ్ళీ ప్రణాళిక వేసి, వాటిని ప్రజల ముందు పెడితే బాగుంటుంది అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### అమరావతి ఎప్పటికి పూర్తవుతుంది ?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలింది. ఆ టైమ్ లో అమరావతిని రాజధానిగా చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. రాజధాని మాత్రమే కాదు... దాన్ని విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దాలని కూడా చంద్రబాబు ఆలోచించారు. ఆయన పిలుపుతో రైతులు వేల ఎకరాల్లో భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. కానీ తర్వాత టర్మ్ లో చంద్రబాబు ఓడిపోవడం, జగన్ రావడంతో రాజధాని నగరంలో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. మళ్ళీ చంద్రబాబు రెండోసారి అధికారంలోకి వచ్చే దాకా అదే పరిస్థితి కొనసాగింది. ఇప్పుడు మళ్లీ అమరావతి ముస్తాబుకి రెడీ అవుతోంది. కేంద్రం నిధులు ఇచ్చింది. బయట కంపెనీలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. అమరావతికి కొత్తగా రీటెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించారు. రుణాలు, నిధుల సమీకరణలో ముందడుగు పడింది. కానీ పనులు స్పీడప్



కాలేదు. పది నెలలైనా అమరావతి పనులు ప్రారంభం కాకపోవడంతో జనంలో నిరాశ కనిపిస్తోంది. అయితే అమరావతి పనులు ఈ నెలలోనే ప్రారంభమవుతాయిన ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఏడాదిన్నరలో కోర్ క్యాపిటల్ ను పూర్తి చేయాలి. ఇప్పటికే భూములు కేటాయించిన సంస్థలన్నీ తమ బిల్డింగ్స్ నిర్మించుకుని ఆఫీసులు మొదలుపెట్టాలి. అప్పుడే ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడుతుంది. ఆ తర్వాతే 44 వేల ఎకరాల భూసేకరణ సంగతి ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. భూములు ఇచ్చి త్యాగాలు చేసిన రైతులు.. గతంలోలా ఇబ్బంది పడకూడదు. లాఠీ దెబ్బలు తినే పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నారు.

### 44 వేల ఎకరాలు ఎందుకు ?: షర్మిల ప్రశ్న

అమరాతి రాజధానికి మరో 44 వేల ఎకరాలు కావాలా.. అంత అవసరం ఏమొచ్చిందని ఏపీసీసీ చీఫ్ షర్మిల మండిపడ్డారు. గతంలో సేకరించిన 34 వేల ఎకరాల్లో ఏం చేశారో చెప్పాలని ఆమె నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా, ఇతర మార్గాల్లో సేకరించిన 34 వేల ఎకరాల్లో అసలు ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

అరచేతిలో వైకుంఠం చూపించడం, %ూ×% పేరుతో గ్రాఫిక్స్ మాయ చేయడం, లేనిది ఉన్నట్లు నమ్మించడం ఒక్క బాబు గారికే తెలిసిన విద్య అని విమర్శలు చేశారు. సేకరించిన 34 వేల ఎకరాల్లో అసలు రాజధాని ఎక్కడ? కూలిపోయే స్థాయిలో ఉన్న తాత్కాలిక కట్టడాలు, ఎటు చూసినా పాడుబడిన భూములు... ఇదేనా ఆంధ్రుల ఆత్మగౌరవం? సింగపూర్ ను తలదన్నే ఆకాశ హర్మ్యాలు ఎక్కడ? గతంలో భూములను ఏ సంస్థలకు కేటాయించారు? ఏ ప్రాతిపదికన భూములు ఇచ్చారు?... ఈ ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. 34 వేల ఎకరాలపై వెంటనే పూర్తి స్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలి అని షర్మిల డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ కాలేజీల పరువు నిలబెట్టిన 'షైనింగ్ స్టార్స్': మంత్రి లోకేష్

ఉండవల్లి, షార్ప్ న్యూస్ : "మీరు ప్రభుత్వ విద్యాసంస్థల పరువు నిలబెట్టారు. ప్రైవేట్ కాలేజీల్లో చదివితేనే మంచి మార్కులు వస్తాయన్న అపోహను మీరు తుడిచిపెట్టారు," అంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.

### 'షైనింగ్ స్టార్స్ - 2025' కార్యక్రమం

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 52 మంది ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్ – 2025' పేరుతో మంత్రి సన్మానించారు. ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారికి స్వర్ణ పతకాలు, ల్యాప్‌టాప్‌లు బహూకరించారు."మీ విజయంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై ఉన్న అపోహలకు చెక్ పడింది. మీలాంటి విద్యార్థులతో కలిసి ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీరే నిజమైన బ్రాండ్ అంబాసిడర్స్" అని మంత్రి లోకేశ్ భావోద్వేగంగా మాట్లాడారు. వైసీపీ పాలనలో రద్దయిన మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించడం వల్ల పేద విద్యార్థులకు ఉపశమనం కలిగిందని గుర్తుచేశారు. జూన్ నాటికి ప్రభుత్వ కాలేజీలలో విద్యా సంస్కరణలు పూర్తవుతాయని, తర్వాత విద్యార్థుల శిక్షణా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా దృష్టి సారిస్తామన్నారు మంత్రి లోకేశ్. తన విద్యార్థతలను గురించి చెబుతూ, "నేను కూడా తొమ్మిదో తరగతి వరకు ఆడుతూ పాడుతూ గడిపా. పదో తరగతిలో తెలివి తెచ్చుకొని చదువు మీద దృష్టి పెట్టా. ఇంటర్ తర్వాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో ఎంబీఏ చేసి, వరల్డ్ బ్యాంక్‌లో పనిచేశాను అని తన చదువుల గురించి లోకేశ్ వివరించారు.

### అందరూ ఐటీకే వెళ్లొద్దు

"మారుతున్న కాలానికి తగ్గట్టుగా విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలి. కేవలం ఐటీ రంగానికి పరిమితమవద్దు.




సోలార్, బయోగ్యాస్, పరిశ్రమల లాంటి కొత్త అవకాశాలు వస్తున్నాయి. ఆ దిశగా సిద్ధంగా ఉండండి," అని మంత్రి లోకేష్ విద్యార్థులకు సూచించారు. "మీ విజయానికి మూలం తల్లిదండ్రుల త్యాగమే. వారికి కృతజ్ఞతగా ఉండాలి అని మంత్రి హితవు పలికారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విదేశీ విద్యకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

# ఆసక్తికరంగా కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్

**నిజామాబాద్ :** వరంగల్‌లో బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్లీనరీ సభపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైలెంట్ అయ్యారు. ఆమెకు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం లేదా? అందుకే సన్నాహక సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారా? ప్రస్తుతం గులాబీపార్టీ శ్రేణుల్లో ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. దానికి తగ్గట్లే నిజామాబాద్ జిల్లా నేతల సమావేశాలకు సైతం ఆమె హాజరుకావడం లేదు. పార్టీ పరంగా సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఆమె సొంత ప్లాట్ ఫాం జాగృతితో యాక్టీవిటీస్ చేస్తున్నారనే చర్చజరుగుతుంది. ఇక మున్ముందు కూడా మరింత దూకుడు పెంచాలని కవిత ఆలోచిస్తున్నట్లు సమాచారం.గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 27న వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభను విజయవంతం చేసేందుకు గులాబీపార్టీ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ కేడర్‌ను సైతం పార్టీ నాయకులు సన్నద్ధం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ జనం తరలింపుపై సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎవరికివారు బిజీగా ఉన్నారు. కానీ కవిత మాత్రం పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, వరంగల్ సభ ఏర్పాట్లకు సంబంధించి సైలెంట్‌గా ఉన్నారు.ఇంతకూ వేడుకలను ఆహ్వానం అందలేదా?.. కావాలని పార్టీ ఆమెను పక్కన పెట్టిందా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడు పార్టీలో యాక్టివ్ గా ఉండే కవిత పార్టీ సభ విషయంలో ఎందుకు స్పందించడం లేదనేది ఆమె క్యాడర్‌కే అంతుపట్టడం లేదంట. గ్రేటర్‌లో జరుగుతున్న పార్టీ సన్నాహక సమావేశాల్లో సైతం పాల్గొనడం లేదు. కావాలని ఆహ్వానించడం లేదా? లేకుంటే ఆమె తెలంగాణ జాగృతి సంస్థ ప్రోగ్రామ్స్‌తో బిజీగా ఉండటంతో పాల్గొనడం లేదా? అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన కవిత 2019లో ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. తిరిగి 2021 నవంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. ఆ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి పట్టుకుంది. కేడర్ , నేతలతోనూ పరిచయాలు ఉన్నాయి. పార్టీ సన్నాహక సమావేశాలు అన్ని జిల్లాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అయితే కవిత మాత్రం ఇప్పటివరకు వెళ్లలేదు. పార్టీ కేడర్ ను సభకు సన్నద్ధం చేయడం లేదు.అంతేకాదు ఇటీవల వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతలతోనూ ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలకు సైతం కేసీఆర్ కుమార్తె వెళ్లలేదు. ఇప్పుడు సొంత జిల్లా నిజామాబాద్ లో జరుగుతున్న సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. దాంతో ఆమెకు పార్టీ సమావేశాలు నిర్వహించమని చెప్పలేదా? ఆ జిల్లా అధ్యక్షుడు ఆహ్వానించడం లేదా? అసలు పార్టీ పెద్దలే ఆమెను దూరం పెడుతున్నారా? అనేది తెలంగాణ జాగృతి కార్యకర్తల్లో తీవ్ర గందరగోళానికి కారణమవుతుంది. అయితే పార్టీ సమావేశాలు నిర్వహించమని ఆదేశాలు లేకపోవడంతోనే కవిత ఆ జిల్లాకు వెళ్లడం లేదంట కవిత సొంత ప్లాట్‌ఫాం జాగృతితో యాక్టవిటీస్‌ను ముమ్మరం చేశారు. తెలంగాణ కళలు, సంస్కృతిపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి.. ప్రాచుర్యం కల్పించేందుకు 2006 ఆగస్టులో ఆమె తెలంగాణ జాగృతి సంస్థని ఏర్పాటు చేశారు. నాటి నుంచి జాగృతి సంస్థ బతుకమ్మ ఉత్సవాలతో పాటు సేవాకార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తుంది. ప్రస్తుతం బీసీ, మహిళ అంశంతో ముందుకు సాగుతుంది. 42శాతం రిజర్వేషన్లపై పోరాటం సాగిస్తూనే మరోవైపు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్ఠించాలన్న డిమాండ్‌తో ప్రతిజిల్లాలో ధర్నాలు, నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు.ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏవి దృష్టికి వచ్చినా వాటిపై గళం వినిపిస్తున్నారు. జాగృతితో పాటు పూలే ఫ్రంట్ తో కార్యచరణ కొనసాగిస్తున్నారు.నె క్లెస్ రోడ్డు పరిసరాల్లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయడం అభినందనీయమన్నారు. అలాగే అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదలా ఉంటే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా మండలిలో ప్రభుత్వం కులగణన తప్పుల తడకగా ఉందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. కానీ కవిత మాత్రం మండలిలోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి ఆమె సపోర్టు చేస్తున్నారనే ప్రచారం సైతం జరిగింది.కవిత తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని సహకరించాలని వామపక్షాల మద్దతు కోరుతున్నారు. సీపీఎం జాగృతి కార్యక్రమాలకు మద్దతు ఇస్తామని, కానీ బీఆర్ఎస్ పార్టీగా చేస్తే మాత్రం ఇవ్వబోమని ఖరాఖండిగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు సీపీఐ పార్టీ మద్దతు సైతం కూడగడుతున్నారు. ఆ పార్టీ నేతలతోనూ ఒకటి రెండ్రోజుల్లో భేటీ కాబోతున్నట్లు సమాచారం. జాగృతి చేసే కార్యక్రమాలకు కలిసి వచ్చే పార్టీలన్నంటితోనూ ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజాసమస్యలపై పోరాటాల్లో మరింత దూకుడు పెంచేందుకు కవిత సిద్ధమవుతున్నారంట. గతంలో ఎన్నడూ లేని విధంగా సొంతంగా రాజకీయంగా ఎదగాలని, తన సత్తా ఏంటో చూపాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ఒక వైపు జాగృతి, మరోవైపు పూలే ఫ్రంట్ తో ప్రజలకు దగ్గరై, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కీలక నేతగా ఎదిగేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె అనుసరిస్తున్న వ్యూహాలే స్పష్టం చేస్తున్నాయంటున్నారు. ఎఅందులో భాగంగానే జాగృతి కమిటీలు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి సంస్థను పటిష్టం చేయాలని ప్లాన్ చేస్తున్నారంట. మొత్తమ్మీద కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్ ఆసక్తికరంగా తయారయ్యాయిప్పుడు.

## వేలానికి గోల్కొండ రాయల్ డైమండ్..

**హైదరాబాద్** ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.అప్పట్లో ఇండోర్ మహారాజు వద్ద ఈ ఉంగరం ఉండేదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యుయెలరీ చీఫ్ రాహుల్ కడాకియా అన్నారు. ఇటువంటి ఉంగరం ఎన్నడూ వేలానికి రాలేదని తెలిపారు. వేలంలో ఇది రూ.300 కోట్లు ? రూ.430 కోట్ల మధ్య అమ్ముడుపోవచ్చని చెప్పారు.ఇలాంటి చాలా అరుదైన, విలువైన వజ్రాలు జీవితకాలంలో ఒకసారి మాత్రమే వేలానికి వస్తాయని రాహుల్ కడాకియా అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ అయిన తమ క్రిస్టీస్ 259 సంవత్సరాలుగా పనిచేస్తోందని తెలిపారు. ఇన్నేళ్లుగా క్రిస్టీస్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ, ముఖ్యమైన వజ్రాలను విక్రయించిందని అన్నారు.తమ వేలంలో గతంలో అమ్ముడైన ప్రసిద్ధ గోల్కొండ వజ్రాలకు ఉదాహరణలుగా పలు డైమండ్ల పేర్లను ఆయన వివరించారు. ఆర్చ్‌డ్యూక్ జోసెఫ్ డైమండ్, ప్రిన్సీ డైమండ్, విట్టెల్స్‌బాచ్ డైమండ్ వంటివాటిని అమ్మామని చెప్పారు. రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన నీలి రంగు వజ్రాలలో ఒకటని రాహుల్ కడాకియా ఒక ప్రకటనలో తెలిపారు.క్రిస్టీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ఒకప్పుడు ఇండోర్ మహారాజా యశ్వంత్ రావు హోల్కర్ ఎఎకు చెందింది. 1923లో మహారాజ తండ్రి ఈ వజ్రంతో కూడిన ఒక బ్రాస్లెట్‌ను తయారు చేయాలని ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ లగ్జరీ ఆభరణాల బ్రాండ్ చౌమెట్‌కి ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు అదే ఆభరణాల సంస్థ నుంచి "ఇండోర్ పియర్స్" అనే రెండు గోల్కొండ వజ్రాలను ఆయన కొనుగోలు చేశారు.దశాబ్ద కాలం తర్వాత మహారాజు ప్రసిద్ధ ఫ్రెంచ్ లగ్జరీ ఆభరణాల కంపెనీ మౌబౌసిన్‌కు మరో ఆర్డర్ ఇచ్చారు. ఈ కంపెనీ 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను రీడిజైన్ చేసి ఇండోర్ పియర్ వజ్రాలతో పాటు హారంలో చేర్చింది.న్యూయార్క్‌కు చెందిన హ్యారీ విన్‌స్టన్ అనే ప్రసిద్ధ ఆభరణాల వ్యాపారి 1947లో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను కొన్నారు. ఆయన ఈ నీలి వజ్రాన్ని అదే పరిమాణంలో ఉన్న మరొక తెల్ల వజ్రాన్ని వాడుతూ బ్రూచ్‌ను తయారు చేశారు. తరువాత ఆ బ్రూచ్ బరోడా మహారాజుకు చేరింది. కొంతకాలం తర్వాత ఆ బ్రూచ్ ఆ రాజకుటుంబం ఒక ప్రైవేట్ వ్యక్తికి అమ్మింది. ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.

## తక్కువ ధరకే స్టీల్, సిమెంట్...

**నల్గొండ :** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఇండ్లులేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ పథకాన్ని ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం నాలుగు విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తారు. ఒక్కో లబ్ధిదారునికి మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుంది. మొదటి విడతగా పునాది కోసం రూ. లక్ష, ఆ తర్వాత గోడల నిర్మాణం, పైకప్పు నిర్మాణం, చివరగా ఇళ్లు పూర్తి అయిన ఇలా నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు అకౌంట్లలో జమ చేస్తారు.ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని అన్నారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై శనివారం సాయంత్రం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలన్నారు. కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలని సూచించారు.ఒకవేళ అనర్హులకు ఇండ్లు కేటాయించబడినట్లు తేలితే వెంటనే ఇందిరమ్మ కమిటీకి తెలియజేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి గృహం మంజూరు చేయాలన్నారు. పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. అనర్హులు ఇండ్లు నిర్మించుకున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలతో పాటు, వారు పొందిన నిధులను వసూలు చేయాలన్నారు. లబ్ధిదారుల సౌకర్యం కోసం అదనపు సదుపాయాలను కల్పించాలన్నారు. గృహ నిర్మాణంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు.ఇందిరమ్మ ఇండ్లకు సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ ప్రధానంగా ఉండాలన్నారు. అర్హులైన వారికి మాత్రమే ఈ గృహాలు దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

### బీఆర్ఎస్ పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**యాదాద్రి** బీఆర్ఎస్ 25 ఏళ్లు పూర్తిచేసుకుని రజితోత్సవ వేడుకలకు ముస్తాబవుతున్న వేళ.. గులాబీ శ్రేణులు సభకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో..యాదాద్రి జిల్లా, వలిగొండ మండలం, వేములకొండ లోని మత్స్యగిరి లక్ష్మినరసింహ ఆలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ ఆలయం వరకు బీఆర్ఎస్వీ నాయకులు చేపట్టిన పాదయాత్రను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైల్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 27 న వరంగల్ జరిగే సభ సక్సెస్ కావాలని చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని.. పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల నిరసన

**యాదాద్రి** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకి కేవలం 48 రిజిస్ట్రేషన్ చేయాలని, ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసుకునే విధానం ద్వారా డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాది కోల్పోతున్నామని డాక్యుమెంట్ రైటర్స్ అన్నారు. నూతన విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసారు. సబ్ రిజిస్టర్ కు వినతిపత్రం అందజేసారు. మంగళవారం నుండి శనివారం వరకు డాక్యుమెంట్ రైటర్ సేవలు నిలిపివేయునట్లు తెలిపారు.

# చార్జీల పేరుతో కోతలు

వరంగల్ : అధిక ధర ఆశ చూపి రైతులను తమ వద్ద వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేలా రప్పించి.. తర్వాత చార్జీల పేరుతో కోతలు పెడుతూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో వ్యాపారులు కొందరు మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు తెర లేపారు.మార్కెట్లో వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కిందటి రోజు లభించిన ధరలకు క్వింటాలుకు 100 నుండి 200 రూపాయలు అధికంగా చెల్లిస్తామని మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాలను మార్గమధ్యలోనే అడ్డుకొని తమ ట్రేడింగ్ కంపెనీలు, మిల్లులకు తీసుకెళ్తున్నారు. అధిక ధర ఆశతో వారికి సరుకులను విక్రయించడానికి మొగ్గు చూపిందే తడువు వెంటనే సదరు వాహనాన్ని వే బ్రిడ్జి కాంటా పై తూకం వేయించి తీసుకురావాలని చెబుతున్నారు.వే బ్రిడ్జి తూకం చార్జీ 50 రూపాయలు రైతే చెల్లించి తూకం వేయించి సదరు వ్యాపారికి చెందిన మిల్లు, ట్రేడింగ్ కంపెనీ వద్దకు వాహనాన్ని తీసుకు వెళ్ళగానే అక్కడ నేరుగా లిఫ్ట్ చేయిస్తున్నారు. వే బ్రిడ్జి లో నిర్దేశించిన వే మెంట్ ప్రకారం ప్రకారం ముందుగా నిర్ణయించిన ధరతో లెక్క చూసి రైతుకు డబ్బులు చెల్లించకుండా 30 కిలోలు తరుగు కింద మినహాయించుకుని, ఆ తరువాత బస్తాలకు లెక్క గట్టి ఒక్కో బస్తాకు దదువాయి, హమాలీ, కూలీ పేరుతో 16 నుంచి 25 రూపాయల వరకు చార్జీల పేరుతో కోత పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు.ఎక్కడ కూడా కార్మికుల ప్రమేయం లేకుండానే రైతే నేరుగా తాను పండించిన పంటను ట్రాక్టర్ లేదంటే ఇతర వాహనాల్లో తీసుకువచ్చి వే బ్రిడ్జి కాంట వేయించి ట్రేడర్ వద్దకు తీసుకువచ్చి దిగుమతి చేస్తుండగా చార్జీల పేరుతో మినహాయింపులు చేసుకోవడం విశేషం.దీనికి తోడు నగదు చెల్లింపులు చేస్తున్నామని విక్రయించిన వ్యవసాయ ఉత్పత్తుల విలువలో ఒక శాతం నగదు మినహాయించుకుంటున్నారు. అటు చేయని పనికి చార్జీలు, తరుగు పేరుతో 30 కిలోలు, నగదు చెల్లింపు పేరుతో ఒక శాతం కోత పెడుతుండడంతో ముందు చెప్పిన అధిక ధర.. అన్నదాతకు.. అల్లికి అల్లి.. సున్నకు సున్న.. అన్న చందంగా మారుతోంది. గ్రామాల నుండి కేసముద్రం మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లకు కొందరు ట్రేడర్లు మామూళ్ళు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా తమ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి రైతుకు నచ్చజెప్పి తమకు విక్రయించేలా సహకరించిన డ్రైవర్లకు 150 నుండి 200 రూపాయలు చెల్లిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.మామూళ్లకు ఆశపడ్డ డ్రైవర్లు కొందరు నేరుగా సదరు ట్రేడింగ్ కంపెనీ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లి ఇక్కడైతే మంచి ధర లభిస్తుంది వెంటనే డబ్బులు ఇస్తారని రైతులకు నచ్చజెప్పి సరుకులను డంపు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు తగ్గిస్తున్న వ్యాపారులు, నేరుగా కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు 'రాస్తామాల్' పేరుతో మార్కెట్ కు చెల్లించాల్సిన పన్ను చెల్లింపులు చేస్తున్నారు. 2023 - 24 సంవత్సరంలో 'రాస్తా మాల్' ద్వారా మార్కెట్ ఆదాయం 95 లక్షల రూపాయలు రాగా, 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో కోటి 17 లక్షలకు పెరగడం, అదే సమయంలో కేసముద్రం మార్కెట్ 'గంజ్' ఆదాయం గత ఏడాది రెండు కోట్ల 88 లక్షలు రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు కోట్ల 42 లక్షలకు పడిపోవడం మార్కెట్ బయట పెరిగిన కొనుగోళ్ల తీరుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

**ప్రచారం మినహా చర్యలు లేవు** మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా నిలువరించాల్సిన మార్కెట్ కమిటీ, అధికారులు ఇటీవల దిద్దుబాటు చర్యలు చేపట్టామని ప్రకటించినప్పటికీ కేవలం కంటి తుడుపుగా ఆటోల ద్వారా గ్రామాల్లో మార్కెట్లోనే సరుకులు విక్రయించాలని ప్రచారం చేయడం మినహా మార్కెట్ బయట కొనుగోలు నిలువరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానం ఈ - నామ్ పరిధిలో కొనసాగడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతీయస్థాయిలో విశిష్ట సేవలకు 'బెస్ట్ ఎక్సలెన్సీ' అవార్డు అందుకున్నది. అటువంటి మార్కెట్ లో రోజురోజుకు సరుకుల రాబడి తగ్గిపోయి మార్కెట్ ప్రతిష్ట, ప్రభావం కోల్పోయే పరిస్థితికి చేరువవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

## వ్యవసాయ పరికరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



**మైలవరం** మైలవరం మండలం చిలుకూరువారి గూడెంలో సబ్సిడీపై రైతులకు మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను మైలవరం శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం ప్రారంభించారు. తరువాత గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రాజధానిలోని అనంతవరంలో
# మంత్రి నారాయణ పర్యటన

**అమరావతి** మంత్రి నారాయణ రాజధానిలోని అనంతవరంలో పర్యటించారు. అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ కోసం కొండలను మంత్రి, సీఆర్డీయే, మైనింగ్ శాఖల అధికారులు పరిశీలించారు.మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో రాజధాని పనుల ప్రారంభానికి ఆటంకాలు వచ్చాయి. న్యాయపరమైన సమస్యలు అధిగమించేందుకు 8 నెలలు పట్టింది. 68 పనులకు సంబంధించి 42360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. అమరావతి పనులకు అవసరమైన గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీయే కు కేటాయించింది. గతంలో అనంతవరం కొండను సీఆర్డీయే కు కేటాయించారు...అయితే గత ప్రభుత్వంలో 8 మీటర్ల లోతు వరకూ తవ్వేశారు. ఇక్కడ భూమిని కూడా ఏదోక అవసరానికి ఉపయోగించాలని చూస్తున్నాం. రాజధాని లో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడ లను కలిపి మెగాసిటీ గా చేయాలనేది లక్ష్యం. ఎయిర్పోర్ట్ కోసం కనీసం 5 వేల ఎకరాలు అవసరం. ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుంటే 30 వేల ఎకరాలు అవసరం. భూసేకరణ చేస్తే రిజిస్ట్రేషన్ ధర పై రెండున్నర రెట్లు మాత్రమే వస్తుంది. భూసేకరణ ద్వారా తీసుకుంటే రైతులు నష్టపోతారని...సమీకరణ చేయాలని స్థానిక ఎమ్మెల్యే లు కోరారు. ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం. రాజధానిలో 92 పనులను 64,912 కోట్లతో చేస్తున్నామని అన్నారు.

## యువతి మృతి..బంధువుల అందోళన





**నల్గొండ** నిడమానూరు (మం) బొక్క మంతల పాడు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ధర్మారపు మల్లేశ్వరి అనే యువతి హైదరాబాద్ లో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన కుక్కల జాన్ రెడ్డి అనే యువకుడితో కలసి సహజీవనం చేసిందని ఆమెను కాదని జాన్ రెడ్డి మరొక యువతిని పెళ్లి చేసుకోవడంతో మల్లేశ్వరి మృతి చెందింది. మల్లేశ్వరీ మృతి చెందిద లేక చంపా రా అనుమానం తో యువకునీ ఇంటి ముందు మృత దేహం తో మల్లేశ్వరి బందువులు ఆందోళ న చేసారు. ఇంట్లో ఎవ్వరు లేకపోవడం తో మృత దేహం ను ఇంట్లో ఉంచి ఆందోళన చేసారు.

## ఎస్బిఐ బ్యాంకులో భారీ అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడుతున్న మంటలు పొగలు
- వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్ కోట్ ఎస్బిఐ బ్యాంక్ నందు ఘటన

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్ కోట్ ఎస్బిఐ బ్యాంకు నందు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 9.30 నిమిషాలకు బ్యాంకు సెక్రటరీ గార్డు బ్యాంకు తాళాలు తీసి చూడగా ఒకసారిగా పోగలు వ్యాపించాయి దీంతో సెక్రెటరీ గార్డు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నత అధికారులు వచ్చి చూసేసరికి భారీగా మంటలు బ్యాంకు వ్యాపించ సాగాయి దీంతో అధికారులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కోడంగల్ నుంచి ఫైర్ ఇంజన్ రావడం జరిగింది దీంతో మంటలు ఆర్పడం కొనసాగుతుంది అయితే బ్యాంకులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా మరి ఏదైనా ఉందా అనేది ఇంకా తెలియాల్సి ఉంది అయితే బ్యాంకులో సరైన ప్రమాణాలు లేకపోవడం మని మరికొందరు అనుమానిస్తున్నారు బ్యాంకు పై భాగంలో ఇటీవల థర్మ కోల్ షీట్స్ తో పై కప్పు ఫర్నిచర్ గా ఏర్పాటు చేశారని దీని ద్వారా కూడా మంటలు అధికంగా వ్యాపించాయని పలువురు అనుమానిస్తున్నారు దీంతో పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించడంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడ్డారు. ఒక బ్యాంకుకు భద్రత ప్రమాణాలు లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది

## జేఎన్టీయూలో
# హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన

**హైదరాబాద్** కూకట్పల్లి జేఎన్టీయూలో తమ జీతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. విధులకు హాజరుకాకుండా జేఎన్టీయూ క్యాంపస్ లో విధులు బహిష్కరించారు. రెండేళ్లుగా పోరాడుతున్న 500 రూపాయలు పెంచి పనులు చేయమంటున్నారని ఆరోపిస్తున్న సిబ్బంది ఈనెల 1000 రూపాయలు పెంచుతామని పెంచకుండా యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు.
కార్మిక చట్టం ప్రకారం నెలకు 21000 వేతనం ఇవ్వాలని జేఎన్టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## బావిలో దూకి తల్లికొడుకులు ఆత్మహత్య



**సూర్యాపేట** చిలుకూరు మండలం కొత్త కొండాపురంలో దారుణం జరిగింది. వ్యవసాయ బావిలో దూకి తల్లికొడుకు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి బుడిగం వీరమ్మ, కుమారుడు నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం వీరమ్మ అన్న దొంగరి నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. తమ బాగోగులు చూసేవారు లేరని ఆందోళనతో మనస్థాపం చెంది తల్లి కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

## హై టెన్షన్ వైర్లు తాకి డ్రైవర్ మృతి



**రంగారెడ్డి** శంషాబాద్ పరిధిలోని గగన్ పహాడ్ లో విషాదం జరిగింది. ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్ పారిశ్రామిక వాడ లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం తో హై టెన్షన్ వైర్లు తగిలి కంటైనర్ లారీ డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. మృతుడు బీహార్ వాసిగా గుర్తించారు. డ్రైవర్ తన కంటైనర్ వాహనంతో గగన్ పహాడ్ వద్ద పారిశ్రామిక వాడ కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గత కొద్ది రోజుల క్రితం కంపెనీ ప్రాంతంలో అధికారులు సిమెంట్ రోడ్డు వేసారు. రోడ్డు ఎత్తు పెరగడంతో కంటైనర్ కి హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం

## - సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

**( పెండ్యాల రామ్ కుమార్, మంథని )**







తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లు, తేదీలు సూచించారు. దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్–జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపంచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# నేటి విద్యార్థులను రేపటి భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది

పాఠశాల స్థాయి నుండి సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలి

- విద్యాభివృద్ధికి,ప్రభుత్వ పాఠశాలలకు ?
  మౌలిక సదుపాయాలు కల్పనకు అత్యంత ప్రాధాన్యత
- ప్రతీ విషయాన్నీ తెలుసుకోవాలనే ఉత్సుకత కలిగినప్పుడే విద్యార్థులు జీవితంలో ముందుకు వెళతారు
- ఎంపీ పుట్టా మహేష్ కుమార్

– జిల్లాలోని 50 ఉన్నత పాఠశాలలకు 2 కోట్ల విలువైన ప్రయోగ పరికరాలు అందించిన ఎంపీ

**ఏలూరు, ఏప్రిల్, 15:** నేటి విద్యార్థినీ, విద్యార్థులను రేపటి భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు 2 కోట్ల విలువైన ప్రయోగ పరికరాలను అందించే కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి.. ధాత్రిరెడ్డి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లతో కలిసి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ విద్యా ద్వారానే అభివృద్ధి సాధ్యమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో మన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. పాఠశాలల స్థాయి నుండి విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని, ప్రతీ విషయాన్నీ తెలుసుకోవాలనే ఉత్సుకతను విద్యార్థులలో రేకెత్తినప్పుడే వారు జీవితంలో ముందుకు వెళ్తారన్నారు. విద్యా, వైద్యం రంగాలలో ప్రజలకు ఉత్తమ సేవలందించడం ప్రభుత్వ ప్రాధాన్యతన్నారు. రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారని, విద్యార్థులకు మంచి చదువుకునే వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యా బోధనలో ప్రయోగశాలలో నేర్చుకున్న విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు పేరుకుమాత్రమే ఉండేవన్నారు. , ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చి ప్రతీప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు, క్రీడామైదానాలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు . తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య అభ్యసించానని, తాను చదివిన పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ అందించానన్నారు. ఏలూరు జిల్లాలోని ప్రతీ మండలంలోనూ 2 ఉన్నత పాఠశాలలను గుర్తించి, ఒకొక్క పాఠశాలకు 4 లక్షల రూపాయలు విలువ చేసే ప్రయోగ పరికరాలు అంధిస్తున్నానన్నారు. వీటిని చక్కగా వినియోగించుకుని విద్యార్థులు విద్యని అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని, అదేసమయంలో సెల్ ఫోన్ లో సామజిక మాధ్యమాలకు బానిస కావద్దన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంపొందించే విధంగా 2 కోట్ల రూపాయలతో ప్రయోగ పరికరాలు అందించడం అభినందించదగిన విషయమన్నారు. జిల్లా పరిషత్ ద్వారా 50 లక్షల రూపాయలతో విజయకేతనం పుస్తకాన్ని విద్యార్థులకు అందించామని, వీటి వినియోగంతో పాఠశాలల్లో ఉతీర్ణతా శాతం పెరిగిందన్నారు. ఇంచార్జి జిల్లా కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి మాట్లాడుతూ క్లాస్ రూమ్ లో విన్న పాఠాలతో పాటు ప్రయోగాల ద్వారా తెలుసుకున్న జ్ఞానం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఏ రంగంలో అభిరుచి ఉందొ తెలుసుకుని, ఆ రంగంలో వారికి ఉత్తమ విద్యను అందించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంతటి ఉన్నత స్థానానికి చేరుకున్నానని, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయి లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇంటర్మీడియట్ లో హెచ్.ఈ.సి., సీఈ.సి.,కోర్స్ లను ప్రవేశపెట్టాలని, అదేవిధంగా క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలనీ కోరాగా, పరిశీలించి వెంటనే ఏర్పాటుచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రయోగశాలను ఎంపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ షాజితా, ఎండి. మొబినా లను దుశ్శాలువాతో ఎంపీ సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు అందరూ కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఇంచార్జ్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాఠశాల విద్యార్థినులతో సెల్ఫీ దిగి, ప్రతీ ఒక్కరి వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), డీఈఓ వెంకట లక్ష్మమ్మ,సర్వశిక్షా అభియాన్ ఏపిసి పద్మకుమార్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు, స్థానిక కార్పొరేటర్ టి. అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ కుమార్, పూజారి నిరంజన్, ప్రభృతులు పాల్గొన్నారు.

# నగరి బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాలు











**నగరి** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరి బస్టాండ్ లో విన్యాసాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అగ్నిమాపక వారోత్సవాలు నగరి బస్టాండ్ ప్రాంగణంలో ఫైర్ అవేర్నెస్ గ్యాస్ అవేర్నెస్ వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి సబ్ డిస్టిక్ డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సయ్యద్ అజీజ్ అహ్మద్ హాజరయ్యారు . అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన వారోత్సవాలు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ విన్యాసాల కార్యక్రమంలో ప్రతాప్ ప్రవీణ్ మోహన్ సత్య ప్రకాష్ రామచంద్రయ్య కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లేడీ అఘోరి పెళ్లి



**హైదరాబాద్** లేడీ అఘోరి అలియాస్ శ్రీనివాస్ పెళ్లి చేసుకున్న వీడియో సోషల్ మీడియా లో ఇప్పుడు వైరల్ గా మారింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వర్షిని అనే యువతని లేడీ అఘోరి పెళ్లి చేసుకుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ అలియాస్ శ్రీనివాస్ అంశం హాట్ టాపిక్‌గా మారింది..ఇప్పటికే పలు వివాదాలకు మూల కారణమైన అఘోరీ మరో సంచలనానికి తెర లేపింది. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన వర్షిణి అనే యువతిని గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసుకుంది.ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఓ చిన్న ఆలయంలో అఘోరీ, వర్షిణీ మెడలో తాళికట్టగా..ఇద్దరూ ఒకరికొకరు దండలు మార్చుకున్నారు. అనంతరం తలంబ్రాలు పోసుకోవడంతో పాటు ఏడడుగులు కూడా కలిసి నడిచిన దృశ్యాలు ఆ వీడియోలో దర్శనమిచ్చాయి.అక్కడే ఉన్న పలువురు భక్తులు ఉత్సహంగా భక్తి పాటలు పాడుతూ వారిని ఆశీర్వదించారు.కాగా నందిగామలో వివస్త్రగా ఉన్న సమయంలో వర్షిణీ ముందుకొచ్చిన అఘోరీకి సాయం చేసింది. అనంతరం వారి మధ్య పరిచయ కాస్త ప్రేమగా మారింది.ఈ క్రమంలోనే అఘోరీ, వర్షిణీని గుజరాత్‌లోని సౌరాష్ట్రకు తీసుకెళ్లింది. అయితే, తమ కుమార్తెకు లేనిపోని మాయమాటలు చెప్పి అఘోరీనే ఎత్తుకెళ్లాడంటూ వర్షిణీ కుటుంబ సభ్యులు రెండు రాష్ట్రాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆ తర్వాత కుటుంబ సభ్యులే స్వయంగా గుజరాత్‌కు వెళ్లి వర్షిణీకి నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చారు. కొన్నాళ్లు బాగానే ఉన్న వర్షిణీ మళ్లీ ఇంట్లో నుంచి చెప్పాపెట్ట కుండా వెళ్లిపోయింది రెండు రోజుల క్రితం అఘోరీ తో మళ్లీ పెళ్లితో దర్శనమి చ్చింది.

# భర్తే...యముడు...

## - ఇంట్లో చెప్పకుండా రెండేళ్లు మేనేజ్

**విశాఖపట్టణం** వారిద్దరి కులాలు వేరు.. మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. పెళ్లి జరిగి రెండేళ్లు అయ్యింది. ఈ విషయాన్ని భర్త తల్లిదండ్రులకు చెప్పకుండా మేనేజ్ చేశాడు. భార్య గర్భవతి అయ్యింది. రేపో మాపో పండంటి బిడ్డకు జన్మ ఇవ్వనుంది. అంతలో కట్టుకున్న భార్యని ఆ లోకం నుంచి పంపించేశాడు భర్త. సంచలన రేపిన ఈ ఘటన విశాఖ సిటీలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్, సిటీలోని ఓ ప్రాంతానికి చెందిన అనూషను ప్రేమించాడు. అనూష తల్లికి చూపు మందగించింది. నాలుగేళ్ల కిందట తండ్రి చనిపోయాడు. ఆ ఇంటికి ఆమె పెద్ద దిక్కు అయ్యింది. మూడేళ్లు కిందట జ్ఞానేశ్వర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరిద్దరు కులాలు వేరు వేర్వేరుజ్ఞానేశ్వర్ రెండు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నడుపుతున్నాడు. డబ్బులకు కొదవలేదు. పెళ్లి జరిగి మూడేళ్లు గడిచినా భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేయలేదు జ్ఞానేశ్వర్. పెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా సిటీలో ఉద్యోగం చేస్తున్నానని వారిని నమ్మించాడు. అత్తమామల వద్దకు వెళ్దామని భార్య ఎప్పుడు అడిగినా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునేవాడు.భార్య అనూష గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఎనిమిదో నెల. వచ్చేవారంలో ఆమెకి డెలివరీ డేట్ ఇచ్చారు డాక్టర్లు. ఇప్పుడున్న సమయంలో భార్య డెలివరీ అయితే తల్లిదండ్రులతో లేనిపోని సమస్యలు వస్తాయని భావించాడు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యని ఏదోవిధంగా చంపేయడమే బెటరని నిర్ణయానికి వచ్చాడు.భార్యను వదిలించుకునేందుకు రకరకాల స్కెచ్‌లు వేశాడు. తనకు క్యాన్సర్ వచ్చిందని ఒకసారి, విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకోవాలని భార్యను కన్వీన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. అందుకు భార్య ససేమిరా చెప్పింది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.గర్భిణిగా ఉన్న అనూషకు నెలలు నిండాయి. సోమవారం ఆమెని ఆసుపత్రిలో చేరాల్సి ఉంది. అక్కడే తన స్కెచ్‌ని పక్కాగా అమలు చేశాడు జ్ఞానేశ్వర్. ఆసుపత్రికి తోడు తీసుకెళ్లేందుకు అమ్మమ్మను రెండు రోజుల కిందట ఇంటికి పిలిచాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలు కలిసి నిద్రపోయాడు. ఇదే సరైన సమయమని భావించాడు భర్త.సోమవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తెల్లారిపోయింది.. మనుమరాలు నుంచి కనీసం ఉలుకు పలుకు లేదు. దీంతో వాళ్ల అమ్మమ్మ కంగారుపడి జ్ఞానేశ్వర్‌ను పిలిచింది. పైకి ఏమీ తెలియనట్టు స్థానికులతో కలిసి భార్యను కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.దీనిపై స్థానికుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరింది. జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పీఎం పాలెం పోలీసులు. దీంతో అసలు విషయం బయటపడింది. ప్రేమ పేరుతో అనూషను నమ్మించి మోసం చేశానని తెలిపాడు. ఆమెని వదిలించుకునే ప్రయత్నంలో హత్య చేసినట్టు అంగీకరించాడు.

# ఏపీకి వచ్చేస్తున్న ఫ్రీ బస్సులు



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది. ఆర్టీసీపై భారం పడకుండా ఎలక్ట్రికల్ త్తు బస్సులను రాష్ట్ర ప్రభుత్వం రెడీ చేస్తుంది. అయితే ఈ పథకం త్వరలోనే అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలసింది. అందుకోసమే అంతా సిద్ధం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని నిర్ణయించి ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మొదటి దశలో కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం పై వివిధ రాష్ట్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఆర్టీసీపై భారం పడకుండా ఉండేందుకు కొన్నిముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో స్పష్టమైన ఇచ్చిన హామీ అమలు చేయకపోతే మహిళల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన ప్రభుత్వం త్వరలోనే ఈ పథకాన్ని అమలుచేయాలని భావిస్తూ ఎలక్ట్రికల్ బస్సులను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఉచిత ప్రయాణం పెద్దగా ఖర్చు లేకుండానే, భారం ఆర్టీసీపైనా, ప్రభుత్వంపైన పడకుండానే నామమాత్రంగా వ్యయంఅవుతుందని ప్రభుత్వం అంచనాలు వేస్తుంది. నగరాలకు కేటాయించి... అందులోనూ కొన్ని నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా తీసుకుంది. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాల వరకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎక్కువగా సిటీ బస్సుల్లో ఎక్కువ మంది ఉచితంగా నిత్యం తిరిగే అవకాశముందని భావించిన ప్రభుత్వం మొదటి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తుంది. ఇందులో వంద బస్సులు విశాఖపట్నానికి కేటాయించారు. మరో వంద బస్సులు విజయవాడకు ఇచ్చారు. గుంటూరుకు వంద, నెల్లూరుకు వంద, కర్నూలుకు యాభై బస్సులతో పాటు కాకినాడ, రాజమండ్రి, కడప మరియు అనంతపురం డిపోలకు 50 బస్సులు కేటాయించనున్నారు. తిరుపతితో పాటుమంగళగిరి డిపోలకు 50 బస్సులు కేటాయించారు. ఈ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లు సంబంధిత డిపోలలో ఏర్పాటు చేయనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నచో?ట ఈ బస్సుల కేటాయింపు చేస్తూ భారం తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది

## ఢిల్లీలో ఆ వాహనాలకు

# నో పెట్రోల్

**న్యూఢిల్లీ :** మీరు ఢిల్లీలో నివసిస్తుంటే, మీకు 10 సంవత్సరాల పాత వాహనం ఉంటే, మీరు ఈ వార్త తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాలుష్యాన్ని నియంత్రించడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ వాహనం పాతదైతే, పెట్రోల్ పంప్ నుండి పెట్రోల్ వేసుకోలేరని గుర్తించుకోండి.పాత వాహనాలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2024 నుండి ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్/సీఎన్జీ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు రవాణా శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే వాహనాల సంఖ్య 55 లక్షలకు పైగా ఉంది. అంతేకాకుండా అటువంటి వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడం పూర్తిగా నిషేధించింది.ఇప్పుడు కారు యజమానులు ఆశ్రయించగల కొన్ని ఎంపికలు ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ నిషేధం తర్వాత, యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను మాత్రమే ఉపయోగించుకోవచ్చు. మీ వాహనం 10 సంవత్సరాలు (డీజిల్) లేదా 15 సంవత్సరాలు (పెట్రోల్, సీఎన్జీ) పూర్తి చేసి ఉంటే, దానిని ఔఅఖీ నుండి బయటకు రావాలంటే ఒక సంవత్సరం లోపు ఎన్వోసీ పొందడం తప్పనిసరి.ఇది కాకుండా, స్క్రాపింగ్ కూడా చివరి ఎంపికగా అందుబాటులో ఉంది. మీరు స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ అప్లికేషన్ ద్వారా మీ వాహనాన్ని స్క్రాప్ చేస్తే కొత్త వాహనం కొనుగోలుపై మీకు మోటారు వాహన పన్ను మినహాయింపు లభిస్తుంది.ఢిల్లీలో పాత వాహనాలను నడిపినా లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినా, మీకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. అలాగే, మీ వాహనాన్ని కూడా జప్తు చేయవచ్చు. ఢిల్లీ ప్రభుత్వం 477 పెట్రోల్ పంపులలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. ఈ వ్యవస్థ సహాయంతో వాహనాల వయస్సుకు సంబంధించిన డేటా అందుబాటులో ఉంటుంది. మీ వాహనం నిర్దేశించిన పరిమితి కంటే పాతదైతే, దానికి పెట్రోల్/డీజిల్‌ను వేయించుకోలేరని గుర్తించుకోండి.



# ఏంటి.. రకుల్ ప్రీత్ సింగ్ ప్రగ్నెంటా

## – అందుకే అలా చేస్తుందా?

ఒకప్పుడు తెలుగులో టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. దాదాపు టాలీవుడ్ టాప్ హీరోలందరితో నటించి అలరించింది. మహేష్ బాబు, ఎన్టీఆర్ , అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ వరుస ఫ్లాపులతో డీలా పడింది. టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గడంతో కోలీవుడ్, బాలీవుడ్‌లోకి వెళ్లి అక్కడ తన అదృష్టం పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. కాని అక్కడ ఆమెకి సరైన సక్సెస్ రాలేదు. ఇక అవకాశాల కోసం ఫొటో షూట్లు, జిమ్ వీడియోలతో గ్లామర్‌గా కనిపించినా కూడా రకుల్‌ని పట్టించుకునే వారే కరువయ్యారు.రకుల్ సినిమాల్లో కనిపించి దాదాపు రెండేళ్లు కావొస్తోందంటే ఆమె పరిస్థితి ఏ రకంగా ఉందో మనకి అర్థం అవుతుంది. ఇక సినిమా అవకాశాలు తగ్గడంతో ఈ భామ తను ప్రేమించిన జాకీ భగ్నానీని వివాహం చేసుకుంది. వారి వివాహం గత ఏడాది ఫిబ్రవరి 21న జరిగింది. అంగరంగ వైభవంగా జరిగిన వివాహ వేడుకతో రకుల్, జాకీ ఒక్కటి కాగా, వారి వివాహం పంజాబీ సాంప్రదాయ పద్ధతిలో జరగ్గా.. ఆ తర్వాత వరుడి సాంప్రదాయం ప్రకారం సింధి పద్ధతిలో అట్టహాసంగా జరిగింది. ఇక రీసెంట్ గా రకుల్, జాకీల జంట.. తమ తొలి వివాహ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగానే జరుపుకున్నారు. అయితే జాకీ, రకుల్ జంట.. త్వరలో తల్లిదండ్రులు కానున్నారని బీటౌన్‌లో ఓ వార్త జోరుగా ప్రచారం సాగుతోంది. సాధారణంగా రకుల్.. టైట్ ఫిట్ అండ్ గ్లామరస్ డ్రస్సుల్లో ఎప్పటికప్పుడు కనిపిస్తుంటుంది. కానీ ఇప్పుడు ఫుల్ కంఫర్ట్ అండ్ ఫ్రీ డ్రెస్సుల్లో కనిపిస్తుండే సరికి గర్భిణీ అవ్వడం వల్ల డ్రెస్సింగ్ సెన్స్ లో ఛేంజ్ తీసుకొచ్చిందని నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. దీనికి తోడు జాకీ తమ కిచెన్ లో ఎంతో ప్రేమగా వంట చేస్తూ కనిపించే సరికి.. రకుల్ కోసమే జాకీ ఇంత కష్టపడుతున్నాడు అనుకుంటా అని నెట్టింట జోరుగా చర్చలు నడుస్తున్నాయి. జాకీ దగ్గరుండి రకుల్‌ని జాగ్రత్తగా చూసుకుంటున్నారని , త్వరలోనే రకుల్ ప్రెగ్నెన్సీ విషయాన్ని అనౌన్స్ చేయనున్నారని అంటున్నారు.

# అవి చిన్న సినిమాలా? పెద్ద సినిమాలా?

ఓవైపు సినిమాలు, మరోవైపు సిరీస్‌తో బిజీగా ఉన్నారు అందాలభామ తమన్నా. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నాకు.. 'ఆఫర్లు లేకపోవడంతో చిన్న సినిమాల్లో నటిస్తున్నారా?' అనే ప్రశ్న ఎదురైంది. తమన్నా మాట్లాడుతూ 'నా దృష్టిలో చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. ఓ తక్కువ బడ్జెట్ సినిమా కంటెంట్ బావుండి హిట్ అయితే.. అదే పెద్ద సినిమా. ఓ భారీ బడ్జెట్ సినిమా కంటెంట్ బాగుండక ఫ్లాప్ అయితే.. అది ఆటోమేటిగ్గా చిన్న సినిమా అయిపోతుంది. ఓ తక్కువ బడ్జెట్ సినిమా కంటెంట్ బావుండి హిట్ అయితే.. అదే పెద్ద సినిమా. ఓ భారీ బడ్జెట్ సినిమా కంటెంట్ బాగుండక ఫ్లాప్ అయితే.. అది ఆటోమేటిగ్గా చిన్న సినిమా



'హ్యాపీడేస్' చేశా. అందులో ఎనిమిదిమంది ప్రధానపాత్రధారుల్లో నేనూ ఒకదాన్ని. ఆ సినిమా మీ దృష్టిలో చిన్న సినిమానా? పెద్ద సినిమానా? ఆ సినిమా బడ్జెంట్ ఎంత? రాబట్టింది ఎంత? రీసెంట్‌గా 'స్త్రీ 2'లో ప్రత్యేక గీతంలో నర్తించా. నాకు డాన్స్ అంటే ఇష్టం కాబట్టే చేశా. నిజానికి ఆ సినిమాలో హీరోనే లేడు. కానీ 900కోట్లు వసూలు చేసింది. అది చిన్న సినిమానా? పెద్ద సినిమానా? ఇక్కడ హిట్ అవ్వడం ముఖ్యం.' అంటూ చెప్పుకొచ్చింది తమన్నా.



# బ్రదర్.. నా గురించి నువ్వేం బాధ పడకు

సోషల్ మీడియా వచ్చాక, పనిలేని వాళ్లందరికీ పని దొరికినట్టయ్యింది. అదికూడా పైసా ఉపయోగం లేని పని. తమకే కాదు, సమాజానికి కూడా ఏ మాత్రం ఉపయోగం లేని పోస్టులను పెడుతూ ఏరోజుకారోజు సంతృప్తిని పొందే బ్యాచ్ కొందరు తయారయ్యారు. అలాంటి ఓ బ్యాచ్‌కి చెందిన ఒకడు.. హీరోయిన్ నిధి అగర్వాల్ గురించి తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఆమెను శ్రీలీలతో పోలుస్తూ.. '2019లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత ఈమె ఏం చేసింది? ఎన్ని సినిమాలు చేసింది? 2021లో వచ్చిన శ్రీలీల ఇప్పటికి 20 సినిమాలు చేసింది.' అని వ్యంగ్యంగా రాసుకొచ్చాడు.ఆ పోస్ట్ నిధి అగర్వాల్ కంటపడింది. దాంతో ఆమె తనదైన శైలిలో స్పందించింది. ' 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత తెలుగు, తమిళం కలిపి మూడ్నాలుగు సినిమాలు చేశా. 'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్' సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. మంచి స్క్రిప్ట్ అనుకుంటేనే సంతకం చేస్తున్నా. నాకు వరుసగా సినిమాలు చేయాలని లేదు. మంచి సినిమాల్లో భాగం కావడమే నాకు ముఖ్యం. ఇండస్ట్రీలో చాలాకాలం ఉండాలనుకుంటున్నా. కాబట్టి.. బ్రదర్ నా గురించి నువ్వేమీ బాధ పడకు..' అంటూ కౌంటర్ ఇచ్చింది నిధి అగర్వాల్.

# వెంకటేశ్‌తో త్రివిక్రమ్ సినిమా?

వెంకటేశ్– త్రివిక్రమ్.. ఈ కాంబినేషన్ సినిమా కోసం ఆశించని ప్రేక్షకుడు లేడు. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అయ్యిందని విశ్వసనీయ సమాచారం.వాస్తవానికి బన్నీ హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా చేయాలి. అయితే.. అట్లీ ప్రాజెక్ట్‌ని ముందు ఓకే చేశారు బన్నీ. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యే సరికి దాదాపు ఏడాదిన్నర పట్టడం ఖాయం. ఈ లోపు బన్నీ స్క్రిప్ట్ పూర్తి చేస్తూ, మరోవైపు వెంకీతో సినిమా కానిచ్చేయాలని త్రివిక్రమ్ నిర్ణయించారట. వెంకటేశ్‌కి సరిగ్గా సరిపోయే ఫ్యామిలీ డ్రామా సబ్జెక్ట్ త్రివిక్రమ్ దగ్గర సిద్ధంగా ఉందట. త్వరలో షూటింగ్ మొదలుపెట్టి, త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో త్రివిక్రమ్ ఉన్నారట. ఆ వెంటనే బన్నీ సినిమా మొదలుపెడతారన్నమాట.







# అర్జున్ సర్కార్ హింసాత్మక సంహారం

అగ్రహీరో నాని అప్ కమింగ్ సినిమా 'హిట్: ది 3rd కేస్'. దర్శకుడు శైలేష్ కొలను 'హిట్' ఫ్రాంచైజీలో ఇది మూడో సినిమా. ప్రశాంతి తిపిర్నేని, నాని కలిసి నిర్మిస్తున్నారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని వైజాగ్‌లో అభిమానుల సమక్షంలో మేకర్స్ విడుదల చేశారు. నాని ఇందులో అర్జున్ సర్కార్‌గా నటించారు. ఆ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. 'క్రిమినల్స్ ఉంటే భూమ్మీద 10 ఫీట్ సెల్‌లో వుండాలి. లేదా.. భూమిలో 6 ఫీట్ హోల్‌లో వుండాలి..' అంటూ అర్జున్ సర్కార్‌గా నాని చెప్పిన డైలాగ్ పాత్ర స్వభావాన్ని తెలియజేస్తున్నది.ఓ పాప కిడ్నాప్ కేసు బాధ్యతను అర్జున్ సర్కార్ తీసుకోవడం.. నేరస్థుల ప్రపంచంలోకి వెళ్లి కనికరం లేకుండా వేటాడటం.. న్యాయం కోసం వాళ్లను అత్యంత హింసాత్మకంగా చంపటం ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఉద్రేకపూరితమైన పాత్రలో అద్భుతంగా నానీని ప్రజెంట్ చేశారు దర్శకుడు శైలేష్ కొలను. మే 1న రాబోతున్న ఈ క్రైమ్ ఎమోషనల్ థ్రిల్లర్ ఆడియన్స్‌ని తప్పకుండా ఆకట్టుకుంటుందని నాని నమ్మకం వ్యక్తం చేశారు.

On behalf of Circulated and owned by Vutukuru Venkateswara Sarma, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Printed at Sri Sindhuja Printers, Screens & Graphiscs, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Editor : Vutukuru Venkateswara Sarma, Mob: 9491021199, RNI: APTEL/2012/48884, Email: editorsharpnews@gmail.com